ఫిబ్రవరి-2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | మనస్సుమారి... | 02 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| చస్తే చావను | కె.ఇ. రాజేంద్ర | 08 |
| రుచిచూచి తెలిసికొనుడి | డా॥ సుష్మ, నెల్లూరు | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 11 |
| వెలుగైన నా రక్షణకర్త | సాక్ష్యము | 13 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 15 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| రాహాబు | స్త్రీల కొరకు | 20 |
| కలిగినవాటికై | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-02 | | 24 |



సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-




చిరునామా :

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51, క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



బ్యాంకు అకౌంటు వివరాలు :

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


| సీరియల్ నంబరు | |
|---|---|

సంపాదకీయం....

# మనస్సు మారి...

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామము వందనములు!

మనిషి ఈ లోకసంబంధమైన విషయాలలో క్రొత్తదనాన్ని కోరుకుంటాడు. మార్కెట్లోకి ఏదైనా క్రొత్త వస్తువు వస్తే వాటిని సంపాదించుకోవాలని తాపత్రయపడతాడు. ఈ భూమి మీద ఏది తయారు చేయబడినా, అది ఇంతకుముందు సృష్టింపబడినదాని నుండి తయారు చేయబడినదే తప్ప మనిషి క్రొత్తగా సృష్టించినది కాదు. 'మునుపు ఉండినదే ఇక ఉండబోవునది; మునుపు జరిగినదే ఇక జరుగబోవునది; సూర్యుని క్రింద నూతనమైనదేదియు లేదు. ఇది నూతనమైనదని యొకదాని గూర్చి యొకడు చెప్పును; అదియును మనకు ముందుండిన తరములలో ఉండినదే (ప్రసంగి 1:9,10). మనిషిని దేవుడు యథార్ధ హృదయముతో పుట్టించాడు. అయితే మనిషి తన యథార్థతను విడిచి వేరే రూపంలోకి మారిపోయాడు. కాబట్టి మనిషిని దేవుడు పుట్టించినప్పుడు ఎలా అయితే యథార్థంగా పుట్టించాడో తిరిగి మళ్లీ అలాంటి యథార్థత సంతరించుకున్నప్పుడు నూతన సృష్టిగా మారిపోతాడు. మనిషి మనసు మారినప్పుడే నూతమనేది వర్తిస్తుందే తప్ప మనసు మారనంతకాలం వారిలో నూతనమనేది ఉండదు. ఈ భూమి, ఆకాశం, ప్రకృతి, సృష్టిలోనిది ఏదైనా సరే మనిషి కంటే ముందే సృష్టింపబడ్డాయి. మనిషిని సృజించాక దేవుడు క్రొత్తగా ఏమి చేయలేదు. మనిషి తనకోసం ఏదైనా క్రొత్తగా చేసుకుంటే అవి తన ఆలోచనలకు అనుగుణంగా సృష్టిలో ఉన్నవాటితో చేసుకున్నవే. పాపపు జీవితంలో జీవించే వారు మారినట్లు కనిపించవచ్చు కాని, వారి హృదయము ఇంకా పాపపు ఆలోచనలతోనే ఉండవచ్చు. అయితే మనలో నూతనత్వమనేది మనుష్యుల ద్వారా కాక దేవుని ద్వారా గుర్తింపబడాలి. ఉత్తమమైనది, అనుకూలమైనది, సంపూర్ణమైనది అయిన దేవుని చిత్తము ఏమిటన్నది మనం పరిశీలించటం ద్వారా, పరీక్షించటం ద్వారా, ఆలోచించటం ద్వారా మన మనస్సు మారుతుంది. అప్పుడే మనకి నూతనమనేది ఆపాదించబడుతుంది. 'మనము పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితో కూడిన ఆట పాటలు... మొదలైన వాటియందు నడుచుకొనుచు అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును' (1 పేతురు 4:3). కాబట్టి ఈ నూతన సంవత్సరములో ఈ లోకమర్యాద నుండి మీ మనసు మార్చుకొని దేవుని గురించి ఆలోచించటం ద్వారా రూపాంతరం చెందవచ్చు. రూపాంతరమనేది ఒక్కసారే జరుగుతుంది తప్ప తరచుగా జరిగేది కాదు. అంటే ప్రతి సంవత్సరం జనవరి మొదటి తేదిన మార్పు చెందటమనేది రూపాంతరము చెందినట్లు కాదు. దేవునికి ఇష్టమైన క్రొత్త జీవితం జీవించటం ద్వారా దేవుని ఆశీర్వాదాలు పొందుకోవచ్చు. దేవుడు మిమ్మును మీ కుటుంబమును అత్యధికముగా ఆశీర్వదించును గాక!

*–ఎడిటర్, కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర*

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్



# జఫ్నత్పనేహు

(యోసేపు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

"ఎవరీ హెబ్రీయుడు? యోసేపు ముఖంలో కాంతిని ఎక్కడా, ఎవరి ముఖంలోను, తన దగ్గర రాజసన్నిధిలో రాజఖైదీల బందీఖానాలోను, పెద్ద ఉద్యోగస్తులలో కాని ఎప్పుడూ చూడలేదు. అతని హృదయం యొక్క దర్పణమే అతని ముఖం. యోసేపు యొక్క ఋణం ఎలా తీర్చుకుంటాను? ఈ రోజు ఉదయం యోసేపును తను కలుసుకు నేటంత వరకు తను ఇంత ఐశ్వర్యవంతుడని తనకే తెలియదు. అసలు యోసేపు తన ఇంటిలో అడుగు పెట్టిన రోజే తను ఐశ్వర్యవంతుడన్న మాట. కాదు, యోసేపే ఒక ఐశ్వర్యము. కాని అతనికి ఐశ్వర్యం, అందం, ఆలోచన, ఆనందం, అంతా అతని దేవుడే అని అంటాడు. ఐగుప్తులో చాలామంది దేవుళ్ళు ఉన్నారు. ఓను, ఓపిన్, ఇసిక్ వాటిని కాని, వాటి దేవాలయాలను కాని తను ఎన్నడు దర్శించ లేదు. తను ఎన్నడైనా దేవుని గురించి ఆలోచించలేదు. ప్రతి దేవునికి ఒక విగ్రహముంటుంది. కాని యోసేపు దేవునికి విగ్రహం లేదు. అతను ఎన్నడూ తన దేవుని రూపాన్ని తనకు కాని, తన యింట్లో వారికిగాని ఈ ఎనిమిది సంవత్సరాలలో చూపించలేదు. ఇప్పుడు యోసేపు దేవుని విషయం తానెందుకు ఆలోచించాలి?"

యోసేపు తన దగ్గర ఉంటే అతని దేవుడు కూడా తనవాడే కదా? అని అనుకున్నాడు. ఒకవేళ యోసేపు తన దగ్గర నుండి వెళ్ళిపోతే, అసాధ్యం. తను బ్రతికి ఉండగా యోసేపు తన దగ్గర నుండి వెళ్ళిపోవలసిన కారణం కనిపించదు. యోసేపు కోరితే అతను ఇందాక అన్నట్లుగా అతని దేవుడు అతని విషయంలో ఏదో ఒకటి నిర్ణయించి అతన్ని విముక్తుడ్ని చేస్తే! అతని జీవితానికి కావలసినది ఇప్పుడు తన ఆస్తిలో సగభాగమే కాదు, తనకు తెలియకుండా తన కొరకు యోసేపు సంపాదించి దాచిన తలాంతులు అన్నీ అతనికే ఇచ్చివేస్తాను అనుకున్నాడు. రథం సముద్ర తీరానికి ప్రయాణం చేస్తుంది.

పోతీఫరు వెళ్ళిపోయిన తర్వాత యోసేపు, గది లోనికి వెళ్ళి లెక్కల కాగితాలు అన్నీ సర్ది దాచి పెట్టాడు. షెతార్‌ని పిలిచి రథం సిద్ధం చేయమన్నాడు. బానిసలు స్నానానికి నీళ్ళు సిద్ధం చేసారు. యజమానురాలి వద్దకు వెళ్ళాలి అనుకున్నాడు. ఆమె కోసమే కదా, తను ఈ ఇంట్లో కొనబడింది. అలాంటప్పుడు ఆమెను తనకు తెలియకుండానే బాధించానే! అనుకున్నాడు. ఇటువంటి పొరపాటులు ఇక జరగవు అనుకున్నాడు. "ఆమె స్త్రీ కదా! ఓఫిరు బంగారం కొనమంటుంది. ఓడలు కొనటానికి ఏ స్త్రీ సంతోషపడుతుంది? ఔను! బంగారం విషయం తను ఇంతవరకు ఆలోచించనే లేదు. బంగారం ఆభరణ రూపంలో ఉంటే ఆమె ధరించటానికి బాగుంటాయి. ముందు ఓడలు కొనవలసి వస్తే! బంగారం ధర ప్రతిసంవత్సరం పెరుగుతుంది. కనుక డబ్బు షావుకారుల వద్ద ఉంచే కంటే బంగారం రూపంలో ఉంచితే షావుకారులు ఇచ్చే వడ్డీ కంటే రెండంతలు ఎక్కువ వస్తుంది" అనుకుంటూ తన దుస్తులలో మంచివి వేసు కున్నాడు. పోతీఫరు తన కొరకు పంపిన సుగంధం కొంచెం పూసుకున్నాడు. "అరె, ఇదేమిటి? ఈరోజు ఇంత ఉత్సాహంగా ఉన్నాను" అనుకున్నాడు. పోతీఫరుగారితో చాలాసేపు మట్లాడినందు వల్లనా? యజమానురాలిని చూడ వెళ్ళబోవు చున్నందుకా? ఔను... ఐగుప్తు స్త్రీలను తను గమనించి చూడలేదు. కాని తన యజమానురాలి వద్దకు అనేకమంది మర్యాదస్తురాండ్ల యిన స్త్రీలు వస్తుంటారు. వారందరిలో తన యజమానురాలు ఎంతో సౌందర్యవతి. ఆమె చెక్కిన శిల్పం. పోతీఫరు అందానికి ఆమె సమఉజ్జీ" అని అనుకుంటూ వచ్చి రథం ఎక్కాడు. ఈ రథం ఈ రోజే మార్చి, వేరే రథం కొనాలనుకున్నాడు.

వస్త్రశాలకు పోనిమ్మని చెప్పాడు. రథం ఆగింది. యోసేపు దిగితే అతని బానిసలు కూడా వెనుక నుండి

రథం దిగి వెంబడించారు. యోసేపు కిటికీ పరదాలు, ద్వారబంధ పరదాలు కొని డబ్బు చెల్లించి రథం ఎక్కాడు. బానిస వాటిని తీసుకొని వస్తుంటే పై అంతస్తు మెట్లు ఎక్కి యజమానురాలి గది దగ్గరకు వచ్చాడు. బానిసలు ప్రక్కకు తొలగి నమస్కారాలు చేసి తలవంచుకొని తలుపు తెరిచారు. "ఇదేంటి అమ్మగారి అనుమతి లేకుండానే ఈ బానిసలు తనని లోపలికి వెళ్ళమంటున్నారు" అనుకుంటూ లోపలికి వెళ్ళాడు. పరదాలు తెచ్చిన బానిస వాటిని దించి బయటకు వెళ్ళి నిలుచున్నాడు. తలుపు వేయబడింది. ఆ గదిలోని వాసన మధురంగా ఉంది. బయట నుండి వచ్చిన యోసేపుకు ఆ గదిలోని చల్లదనం దప్పిక తీర్చినట్లుగా ఉంది. లోపల గదిలో నుండి సన్నని గొంతు వినబడింది. తన బానిసను ఆమె పిలుస్తుంది అనుకున్నాడు. కొంచెంసేపటికి అదే స్వరం వినిపించింది సన్నగా. "అరె! తనని పిలుస్తుంది" అనుకుని పరదా తొలగించి గదిలోనికి ప్రవేశించాడు. ఆ గదిలోకి తను ఎప్పుడూ రాలేదు. అది శయన మందిరం. పోతీఫరు తప్ప బానిసలు కూడా సెలవు లేనిదే లోనికి రాకూడదు. "ఇదేంటి తను లోపలికి వచ్చేసాడు" అనుకుంటూ వెనక్కి తిరగబోయాడు.

"ఆగండి!" అన్నమాట విని ఆగిపోయాడు.

"ఇటు రండి" అని పిలిచింది. తలెత్తి చూసాడు. చాలా నీరసంలో అనారోగ్యంగా ఉన్నట్లుగా కనిపించింది. అరె! ఇదేంటి పోతీఫరుగారు ఇందాక నాకు చెప్పలేదు. పోతీఫరు మాత్రమే కాదు ఇంటిలో ఎవరూ ఈ సంగతి నాకు చెప్పలేదు. ఎందుకని? తనకి తెలియకుండానే ఆతృతతో దగ్గరకి నడిచాడు. మంచంకి కొంచెం దూరంగా నిలుచుని "ఏమయింది? మీరు ఎప్పటినుండి ఇలా ఉన్నారు? అరె! వైద్యులు రాలేదా?" అంటూ ఆగిపోయాడు.

ఇదేంటి ఇంత నీరసంలోనూ ఆమె చిరునవ్వు నవ్వుతుంది? అనుకున్నాడు. "నాకు అనారోగ్యంగా ఉందా?" అని చెయ్యి చాపుతూ "నా నాడి చూడండి" అంది. వెంటనే నాడి చూసాడు. వేగంగా కొట్టు కుంటుంది. ఆమె నుదురు మీద చెయ్యి వేసాడు. "అరె! వేడిగా ఉందే" అంటూ దూరంగా జరిగాడు. మంచం ఎత్తైనది. చాలా పెద్దది. ఆమె నుదురు మీద చెయ్యి వేసినపుడు తన శరీరం కూడా ఆమెని స్పృశించింది. అందువలన తనకి భయం వేసింది.

"మొదటిసారిగా మీరు నా విషయం ఈరోజు ఆలోచించటం ప్రారంభించారే! మీరు ఇల్లు, పొలాలు, బానిసలు, పనివారు, అంత కంటే ముఖ్యంగా చెట్లు, పూలు – ఇవి తప్ప ఇక్కడ మనుష్యులు వున్నారని ఎప్పుడైనా ఆలోచించారా?" అని అంది చిరుకోపం మిళితమైన చిరునవ్వుతో. యోసేపుకు ఏమి మాట్లాడాలో తెలియలేదు. ఆమె లేచి కూర్చున్నది. తల విరబోసుకొని ఉంది.

"మీ గదికి పరదాలు తెచ్చాను" అన్నాడు ప్రవేశ గదికి దారితీస్తు.

"పరదాలా..! అదిగో చూసారా? మళ్ళీ మీరు ఈ గది, ఈ కిటికీలు, ద్వార బంధములు తప్ప నా విషయం ఆలోచించరే?" అంది. మంచం దిగబోతే, వెంటనే యోసేపు దిగవద్దని, "వైద్యుని పిలుస్తాను" అంటూ బానిస కొరకు పిలవబోయాడు.

వెంటనే ఆమె వారించింది. మంచం నుండి క్రిందకు దిగుతూ, మీరు వయసులో పెరిగారు కాని, మనసులో పెరగలేదు. అవతలి వారి అవసరాలు గుర్తించటం కూడా ఒక విద్యే. అది మీకు అక్షాపు నేర్పలేదు. అంటూ ఆమె ఇవతలి గదిలోకి నడుస్తుంటే యోసేపు వెనుక నుండి చూసాడు.

ఇదేమిటి? ఈమె పూర్తి వస్త్రధారిణి కాకుండానే అవతలి గదిలోనికి వెళ్తుంది అనుకుంటూ ఆగిపోయాడు.

ఆమె అవతలి గదిలోనికి వెళ్ళిన తర్వాత యోసేపు వెళ్ళాడు. ఆమె ఆ పరదాల వైపు చూచి లెక్క చేయలేదు కదా! విసుక్కున్నట్లుగా చూసింది. యోసేపు మనసు చివుక్కుమనిపించింది. అవి యజమానురాలికి నచ్చలేదని అనుకున్నాడు. ఆమె అద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటుంటే, బానిసని పిలువకుండా ఈమె తల దువ్వు కుంటుంది ఎందుకు? అనుకున్నాడు పనివారిని పిలిచే ప్రసక్తి లేనట్లుగా అర్ధమయ్యింది.

"కూర్చోండి" అంది. మంత్ర ముగ్ధునిలా కూర్చున్నాడు ఆమెని చూడాలనిపించి కళ్ళు మాత్రమే పైకెత్తితే, ఆమె

అద్దంలో నుండి తనని గమనించి పెద్దగానే నవ్వింది. "తలెత్తి చూడండి భయం దేనికి" అంటూ తన ఎదురుగా కూర్చుంది.

"మీ యజమానిగారితో మాట్లాడారా?" అని అడిగింది. తలూపాడు యోసేపు.

కొంచెం అధికారంగా, "సరిగా జవాబు చెప్పండి." అని అంది. బయట బానిసలు ఎవరన్నా ఉన్నారేమో అని తలుపు వైపు చూసాడు.

ఆమె మళ్ళీ నవ్వింది. "బానిసలు లోపలికి పిలవందే రారు. బానిసలే కాదు. పోతీఫరు కూడా రాడు" అంది. అ మాటలో వెటకారం ఉంది.

"ఓఫీరు" అనబోయాడు వెంటనే ఆమె అందుకుంది "సువర్ణమా? నీకంటే అందంగా వుంటుందా?" అంది. వెనక్కి తిరిగి నిలువుటద్దంలో నుంచి యోసేపును చూస్తూ.

"యజమాని మీతో మాట్లాడమని చెప్పిన సంగతులు చాలా ఉన్నాయి" అన్నాడు.

ఆమె ఆలోచిస్తూ "చెప్పండి" అంది. మళ్ళీ మనసు మార్చుకొని "మనము ఓను దేవాలయమునకు వెళ్తున్నాము. ఈ రోజు స్త్రీల సంబరాలు జరుగుతున్నాయి" అంది.

"మరి నేనెందుకు" అడిగాడు యోసేపు.

"మరి మీరు పురుషులని ఈ రోజే మీకు గుర్తుకు వచ్చిందా!" అని, "మీకు వివాహం చెయ్యాలని అనుకు న్నాము" అంది.

యోసేపు నిదానంగా "ఆ సంగతి యజమానిగారితో ఇందాక మాట్లాడాను. ఆయన మీతో చెపుతానన్నారు" అన్నాడు. "సరే మీరు నాతో రండి. దారిలో మీ యజమాని మీకు చెప్పిన విషయాలు చెప్పండి" అని లోపలి గదిలోనికి వెళ్ళింది.

ప్రక్కనే ఉన్న గంట కొట్టాడు. బానిస వచ్చింది. "ముక్తార్‌ని పిలువు" అన్నాడు. క్షణంలో ముక్తార్ వచ్చాడు. ఆరడుగుల వీరుడు. అంతఃపుర రక్షణకైన షండుడు. "అమ్మగారు ఓను వెళ్తున్నారు. రథం సిద్ధం చేయండి" అని చెప్పాడు యోసేపు.

ముక్తార్ వంగి నమస్కారం చేసి బయటకు వెళ్ళాడు. పది నిమిషాల్లో ఆమె ద్వారం దగ్గర నిలబడింది. ఆమె ద్వారం వద్దకు రాకముందు ఆమె వాడిన గోపరసం సువాసన బయటకు వచ్చింది. ఇప్పుడు ఆమె పూర్తిగా ద్వారమునకు ఆనుకుంది. ఆమె చాలా సన్నబడిపోయింది. ఇంత అనారోగ్యంలోనూ, ఎంత నాజూకుతనము అనుకున్నాడు.

"మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పోకూడదా? ముందు వైద్యునికి కబురు చేస్తాను" అన్నాడు. మళ్ళీ అదే నవ్వు వెటకారంగా.

**(సశేషం)**


## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా

చందా పంపించాలంటే

ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

# నా చిత్తానుసారుడు



(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

“మీరు చూచితిరి గదా! వానికి పిచ్చి పట్టినది నా యొద్దకు వీనినేల తీసుకొని వచ్చితిరి. పిచ్చి చేష్టలు చేయు వారితో నాకేమి పని? నా సన్నిధిని పిచ్చిచేష్టలు చేయుటకు వీని తీసుకొని వచ్చితిరేమి వీడు నా నగరిలోనికి రాతగునా?” అని వెళ్ళిపోయాడు.

దావీదును ఊరి గవిని నుండి తీసుకొని వచ్చిన ముఖ్య సైనికునికి ఏమి అర్ధం కాలేదు. ఆరోగ్యవంతుడైన అందమైన వానిని తాను రాజుగారి యొద్దకు తీసుకెళ్ళాడు. ఇంతలో ఈ మార్పు ఎలాగ జరిగింది? దావీదు నటించడం లేదు. ఇది యధార్ధం. గవిని బయటకి వచ్చిన తర్వాత కొంతదూరం దావీదును వదలి రమ్మని ఇద్దరు భటులకిచ్చి పంపించాడు.

గాతు పట్టణం దాటే వరకు దావీదు అలాగే పిచ్చివాని లాగానే ఉన్నాడు. ఆ పట్టణం దాటగానే తనలో ఏదో మార్పు వచ్చింది. ప్రక్కనే ప్రవహిస్తున్న ఏటిలో దిగి మరలా తాను ఇటువంటి పనులు చెయ్యకుండా కాపాడమని ఈ రోజు ప్రాణగండం నుండి కాపాడిన దేవునికి ప్రార్ధించాడు.

యెహోవానుబట్టి నేను అతిశయించుచున్నాను దీనులు దానిని విని సంతోషించెదరు. నేను యెహోవా యొద్ద విచారణ చేయగా ఆయన నన్ను తప్పించెను.

అబీషై తన అన్నలు ఓజేము, రద్దయితో కలసి గుహలో కూర్చుని ఉన్నారు. దావీదును చూచి అందరూ లేచారు. దావీదు నడచి అలసిపోయాడు. అలాగే కూర్చుని జరిగిన సంగతి అంతా చెప్పాడు. తరువాత భోజనము ముగించారు.

“దావీదు ఈ చిన్న గుహ నీకు మరుగై యుండలేదు మన ఊరికి దక్షిణాన వున్న అదుల్లాము గుహ అయితే అన్ని విధాల శ్రేయస్కరం. అది యెహోవాచే యూదా గోత్రమును కియ్యబడినది. దాదాపు వెయ్యిమంది అయినా అందులో తల దాచు కొనవచ్చును. అదీకాక మన ఊరికి దగ్గరలో ఉంటుంది. సౌలుకి ఎంత సైన్యమున్నా బేత్లెహేము దాటి ఆ గుహ యొద్దకు రాలేడు” అని అన్నాడు అబీషై.

ఈ ఆలోచన అందరికి నచ్చింది. ఆ రాత్రి బేత్లెహేము వచ్చి కాపురమునకు కావలసిన సామాను తీసుకొని అదుల్లాము గుహలో చేరారు. కొద్ది రోజులలోనే దావీదు అదుల్లాము గుహలో నివశిస్తున్న సంగతి హెబ్రోను బేత్లెహేము, బేత్షెమెషు, శోకో, నెఫ్తాయ, తెకొవ, కొజీమ, కిర్యాతర్బా, యానము, బెతూయేలు, తెరపా, కర్మెలు, మాయెను పురములలో తెలుపబడింది.

ప్రతిరోజు పై పట్టణ గ్రామములలో నుండి జనులు దావీదు దర్శనార్ధం రావటం మొదలుపెట్టారు. వచ్చిన వాళ్ళందరూ కష్టాలు, వ్యసనాలలో ఉన్నవారే. అప్పులు చేసి తీర్చలేని వారు, ప్రవర్తన సరిగా లేనివారు కొంతమంది కుటుంబాలతో సహా వచ్చి అదుల్లాము గుహలో చేరారు.

గుహ పెద్దదే కాని దాదాపు నాలుగు వందలమంది దాక చేరారు. అందరికి దావీదే రాజు. దావీదు దగ్గర చేరిన తర్వాత ఆయన యెడలను, దేవుని యెడలను భయభక్తులు పెంచుకున్నారు.

ఒకరోజు ఉదయాన్నే దావీదు తన అన్న ఓజేము, అబీషైలతో మాట్లాడి ఒక నిర్ణయానికి వచ్చాడు. బేత్లెహేములో ఉన్న తన తల్లిదండ్రులను వారి వస్త్రములను, వస్తువులను అబీషై అదుల్లాము గుహలోనికి చేర్చేటట్లుగా గొఱ్ఱెలను, పశులను బేత్లెహేములోనే అమ్మి ఆ ధరకు యవలు, గోధుమలు, ఇంకా ఆహార పదార్ధములను బండ్ల మీద ఆ గుహకు చేరవేయటం.

దావీదు అదుల్లాము గుహ ఉన్న కొండల మీదుగా ఉప్పుసముద్రం చేరి ఉత్తరముగా గుఱ్ఱం మీద ప్రయాణం చేసి మోయాబు రాజును కలసికొని దేవుడు నాకు ఏమి చేయునది నేను తెలిసికొను వరకు నా తల్లిదండ్రులను వచ్చి నీ యొద్దకు నుండనిమ్మని అడిగాడు. మోయాబు రాజునకు సౌలు శత్రువైనందున అంగీకరించాడు.

మరునాడు కొంతమంది అనుచరులతో బండిలో తన తల్లిదండ్రులను ఎక్కించి మిస్పే చేర్చాడు.

మోయాబు నుండి తిరిగి వచ్చిన తర్వాత దావీదు మనస్సు తేలికైంది. తన మీద కక్షతో తన తండ్రి ఇంటి వారిని తన అన్నలను సౌలు హింసించునేమోనని భయంగా ఉండేది. తన తల్లి దండ్రులకు సరైన రక్షణ కల్పించబడింది. తన అన్నలు అందరూ వారి భార్య పిల్లలతో తనతోనే ఉంటున్నారు. అబీషై వారి అవసరాలు అన్ని చూస్తున్నాడు. ఇంకా చాలా కాలము సరిపోయేంత ధాన్యం ఉంది.

తన దగ్గర చేరిన ప్రతివాడు తనను రాజును చూచి నట్లుగా చూస్తున్నాడు. వారందరూ తనవలెనే ఇబ్బంది కలిగినవారే. దేవుడు వారికి తనను రక్షకునిగా, న్యాయాధి పతిగా నియమించాడు.

ప్రతిరోజు సితారతోను, వీణతోను దేవుని స్తుతిస్తూ ఉండేవాడు. గాదు ప్రవక్త అప్పుడప్పుడు వచ్చి తనకు ధైర్యం చెప్తున్నాడు.

కొంతమంది పురుషులు ఉదయాన్నే అడివికి వెళ్ళి జింకలను, కణుతులను, కొండ మేకలను, గొఱ్ఱెలను వేటాడి తెస్తున్నారు. గుహ దగ్గరలో పంటపొలములు ఉన్నవారు పంట పండిస్తున్నారు. అదుల్లాము గుహలో ఇప్పుడు దాదాపు నాలుగువందల మంది నివాసం చేస్తున్నారు. తన అన్నలు కూడా తనకు లోబడి ఉన్నారు.

అయితే అప్పుడప్పుడు వచ్చే కుటుంబ తగాదాలు, దావీదుకు చికాకు కలిగిస్తుండేవి. అయినా తనకి ఇప్పుడు తోడు నీడగా దేవుడు పంపిన ఈ సహచరులు అంటే దావీదు చాలా ప్రేమ కలిగి ఉండేవాడు.

ఒక రోజు మధ్యాహ్నానం షెలహు గుహలోనికి వచ్చాడు. దావీదు అడిగిన యోగక్షేమములకు వేటికి షెలహు బదులు చెప్పలేదు. చాలా విచారంగా కనిపించాడు.

“మీకాలు బాగుందా?” అన్నాడు దావీదు. “లేదు” అన్నాడు. “ఏమి?” అన్నాడు దావీదు.

“లాయిషు కుమారుడు పల్తీయేలుతో వివాహమైంది” అన్నాడు తలవంచుకొని నెమ్మదిగా. నిజానికి ఈ విషయం చెప్పటానికే ఇక్కడికి వచ్చాడు. దావీదు చాలాసేపు మౌనంగా ఉన్నాడు. “మీకాలు ఇష్టపడిందా?”

“లేదు, కాని ఆమె పల్తీయేలును పెండ్లిచేసుకుంటే నిన్ను చంపవెదకనని చెప్పి బలవంతంగానే జరిపించాడు. ఇప్పుడు బహూరీము దగ్గర పల్తీయేలుతో ఉన్నది. రాజ కుటుంబంతో నీకు ఇక ఏ సంబంధం లేదని ప్రజలకు తెలియజేయటానికి ఈ పని చేసియుంటాడు” అన్నాడు షెలహు.

దావీదు తన ఆసనము మీద నుండి లేచి అడవి వైపుగా వెళ్ళాడు. తంబుర అతని చేతిలో ఉన్నది. షెలహు గుహ ద్వారము వద్ద మౌనంగా కూర్చుని ఉన్నాడు. అడవిలో నుండి తంబురనాదము సన్నగా వినబడుతుంది.

ప్రభువు స్తుతి నొందును గాక! అనుదినము ఆయన మీ భారము భరించుచున్నాడు. దేవుడే మాకు రక్షణ కర్తయైయున్నాడు.

ఒకరోజు గాదు ప్రవక్త వచ్చి కొండలలో ఉండక యూదా దేశమునకు పారిపొమ్మని చెప్పాడు. ఆ రోజు సాయంకాలము దావీదు తన వారందరితో బయలుదేరి దక్షిణముగా ప్రయాణం చేసి హారెతు అడవిలో ప్రవేశించాడు. హారెతులో చిన్న చిన్న కొండలు ఎక్కువగా ఉన్నవి ప్రతి కొండలో చిన్న గుహలు ఉన్నవి. ఇంతకు ముందు అదుల్లాము గుహలో అందరూ కలసి ఉండేవారు. ఇప్పుడైతే నాలుగైదు కాపురాలు కలసి ఒక గుహలోను, పెండ్లికాని వారు, వయస్సు మళ్ళినవారు వేరే గుహలోను, కొంత మంది చిన్న దేరాలు వేసికొని హారెతు అడవిలో రెండు ఎకరాల విస్తీర్ణములో చిన్న గ్రామంలాగ ఉన్నది. అడవిలో జంతువులు, అడవిపండ్లు విస్తారంగా దొరికేవి.

దావీదు కొంత సైన్యము సిద్ధం చేసికొని హారెతు అడవిలో కాపురం ఉన్నాడని సౌలురాజునకు కబురు అందినది. వెంటనే కొంత సైన్యమును తీసుకొని రామా వచ్చాడు. పెద్దలు సమావేశం జరిపే పిచుల వృక్షం క్రింద తన ఈటె పట్టుకొని నిలుచుంటే ఆ వూరి పెద్దలు అందరూ వచ్చి నిలుచున్నారు. **(సశేషం)**



# 'చస్తే చావను'



అలిగిన వాళ్ళని అన్నం తినమంటే 'చచ్చినా తినను' అంటారు, ఇష్టంలేని పని చెయ్యాల్సొస్తే 'చచ్చినా చెయ్యను' అంటారు కానీ, నేను 'చచ్చినా చావను' అని ఎవరైనా అంటారా? ఎవ్వరూ అనరు, అనలేరు కూడా. ఎందుకంటే చావు గురించి ఎవరూ ఆలోచించరు. అందరికి చావంటే చచ్చేంత భయం. ప్రతిరోజూ ఎంతో మంది చనిపోతూనే ఉంటారు. న్యూస్‌పేపర్‌లో కానీ, ఛానల్స్‌లో కానీ చావు వార్తలు లేని రోజు ఒక్కటి కూడా ఉండదు. తెల్లవారి నిద్ర లేచి బయటకు వస్తే కొన్ని చావు ఫ్లెక్సీలు దర్శమిస్తుంటాయి 'ఇంకసెలవు', 'ప్రభువునందు నిద్రించెను' 'శ్రద్ధాంజలి', 'నిర్యాణము' ఇలా రకరకాల పేర్లతో కనిపిస్తాయి. వాళ్ళలో మనకు బాగా తెలిసినవాళ్ళు చనిపోతే చాలా బాధపడతాము. 'అయ్యో, నిన్ననే కలిసి మాట్లాడానే, సరదాగా జోకులు వేసుకున్నాం, ఇంతలోనే' అని ఆశ్చర్యపోతాం. ఒకే ఒక్కరోజు తేడాలో మనుష్యులు మాయమైపోతున్నారు. అయినా కూడా మనకు కనీసం చీమ కుట్టినట్లయినా ఉండదు. నిన్న కలిసి మాట్లాడిన వ్యక్తి తెల్లారేసరికే కనబడకుండా పోయాడే అనుకుంటారే తప్ప, ఆ చనిపోయిన వ్యక్తి స్థానంలో నేను ఉంటే? అని అనుకోరు. 'నేను చావను' అన్న ధీమా ఎక్కడి నుండి వస్తుంది? యాక్సిడెంట్స్‌లో, హార్ట్‌ఎటాక్‌తో అనుకో కుండా చనిపోయిన వాళ్ళని చూచినప్పుడు మనకు గ్యారం టీగా అలా జరగదు అనుకోడానికి, మనల్ని మనం అతీతు లుగా చేసుకోడానికి కారణాలు ఏంటో ఒక పేపర్ మీద రాసి పెట్టుకోండి. చనిపోయిన వాళ్ళు పాపులు, మనం పవిత్రులం కాబట్టి మనం అలా చావలేదని అనుకుంటే అది అవివేకమే. 'సిలోయములోని గోపురం కూలి చచ్చిన ఆ 18మంది, యెరూషలేములో కాపురమున్న వారందరి కంటే అపరాధులని తలంచుచున్నారా?... మీరు మారు మనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు' (లూకా 13:4). మారడానికి దేవుడు మనకిచ్చిన సమయాన్ని దుర్వినియోగం చేయడమేగాక, మనల్ని మనం నీతిమంతు లుగా భావించుకుంటున్నాం. దేవుని రక్షణ కవచం లేకుండా మనకి మనం నీతిమంతులని అనుకుంటే ప్రయోజనం లేదు. బయటకు వెళ్ళినవాళ్ళు ఇంటికి తిరిగి వస్తారన్న గ్యారంటీ ఏమీ లేదు. మనమెన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రమాదం ఏ వైపు నుండి అయినా రావచ్చు. మన గుండె ఏ క్షణాన్నైనా ఆగిపోవచ్చు మనం దేనిని ఆపలేము. మనం మారుమనస్సు పొందకుండా మన ప్రాణాలను కాపాడుకొనే అవకాశం లేదు. దేవుడు మనకి అనుగ్రహించిన ఆయుష్కాలం పూర్తి చేసుకోవాలంటే దేవుని సంరక్షణలోకి వెళ్ళాలి. లేదంటే ప్రమాదాల ద్వారా మరణం మన దగ్గరకు వచ్చి నప్పుడు మనం దాని నుండి తప్పింపబడము. ఎందుకంటే 'మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము' (కీర్తనలు 68:20). దేవుడు యోబుని సాతానుకు అప్పగించినప్పుడు సాతానుతో 'అతని ప్రాణం మాత్రం నీవు ముట్టవద్దని' చెప్పటం గమనించగలం. అంటే మన ప్రాణాలకు ఖచ్చితమైన గ్యారంటీ ఇవ్వగలిందే దేవుడు మాత్రమే. అయితే అది దేవుని బిడ్డలకు మాత్రమే తప్ప ఈ లోకానుసారమైన జీవితం జీవించే వాళ్ళకి మాత్రం కాదు. ఇంత అని దేవుడు మనకు ఆయుష్కాలం ఇచ్చింది మనమాయన కోసం జీవించడానికే తప్ప మని ష్టానుసారంగా జీవించడానికి మాత్రం కాదు. మారుమనస్సు పొందకుండా, దేవునికి అవిధేయతగా జీవిస్తూ నేను **'చస్తే చావను'** అనుకునే వారి ప్రాణాలు గాలిలో దీపంలాంటివే. ఎప్పుడు ఆరిపోతాయో ఎవరూ చెప్పలేరు.


**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# రుచిచూచి తెలిసికొనుడి

"యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి" (కీర్తనలు 34:8). మనకి ఆకలి వేస్తే మన ఆకలి తీరడానికి మనమే ఆహారము తీసుకోవాలి, ఇతరులు తింటే మన ఆకలి ఎలా తీరుతుంది? ఆ ఆహారము రుచి కూడా మనం తింటేనే తెలుస్తుంది. "జీవాహారము నేనే" (యోహాను 6:25). పరలోకపు తండ్రి ఆ నిజమైన ఆహారమైన యేసు క్రీస్తును మనకి అనుగ్రహించాడు. ఆ ఆహారం మన కోసం, మన పాపముల నుండి విడుదల చేయుటకు, మన శాపము తొలగించుటకు, చీకటి నుండి వెలుగులోనికి నడిపించు టకు, నిత్యజీవము ఈ లోకమునకు అనుగ్రహించుటకు అనుగ్రహింపబడెను. బైబిలుగ్రంథంలో చూచినట్లైతే, ఇస్సాకు తన జీవితంలో, తన తండ్రి ద్వారా ఎన్నో అద్భుతాలను చూసాడు. తన తండ్రికి కలిగిన సమస్తమును అనుభవిస్తూ, కనానుదేశంలో నివాసం చేశాడు. కాని దేవుడ్ని రుచి చూడా లంటే, ఇస్సాకు కూడా విశ్వాస పరీక్షగుండా వెళ్ళాల్సిందే. అందుకే ఇస్సాకు ఉన్న దేశంలో కరువు వచ్చింది. అక్కడ నుండి గెరారు అనే ప్రాంతానికి వెళ్ళాడు, అక్కడ అబీమెలెకు అనే రాజుకి భయపడి, తన భార్యను చెల్లెలు అని అబద్ధం చెప్పుటకు శోధింబడ్డాడు. 'ఆ ప్రదేశంతో ఇస్సాకు మిక్కిలి గొప్పవాడగు వరకు క్రమక్రమంగా అభివృద్ధి పొందుచు వచ్చెను' (ఆది. 26:13) నీళ్ళ బావులను తిరిగి త్రవ్వించాడు. ఇదంతా గమనించిన రాజైన అబీమెలెకు నీవు మాకంటె బహుబలము గలవాడవు గనుక మా యొద్దనుండి వెళ్లి పొమ్మని ఇస్సాకుతో చెప్పెను (ఆది. 26:16).

అంతేకాక బావులు త్రవ్వినప్పుడు, అక్కడ ఫిలిష్తీయులు ఇస్సాకుతో గొడవపడతారు. అప్పుడు అక్కడ నుండి వెళ్ళి మరియొక ప్రాంతంలో బావి త్రవ్వించెను. దాని విషయమై వారు జగడమాడలేదు, దానికి 'రెహబోతు' అనే పేరు పెట్టెను. అక్కడ నుండి బేయెర్షెబాకు వెళ్ళిన తరువాత. దేవుడు ప్రత్యక్షమై, 'నేను నీకు తోడైయున్నాను గనుక భయపడకుము' నా దాసుడైన అబ్రాహామునుబట్టి నిన్ను ఆశీర్వదించి, నీ సంతానమును విస్తరింపజేసెదను' అని వాగ్దానం చేస్తాడు. అప్పుడు ఇస్సాకు అక్కడ ఒక బలిపీఠం కట్టి, ప్రార్థన చేస్తాడు. ఇస్సాకు దేవున్ని స్వయంగా రుచి చూచి తెలుసుకున్నాడు. మనం కూడ మన జీవితంలో జరిగే పరిస్థితులనుబట్టి, సంఘటనలనుబట్టి నిరుత్సాహపడ కూడదు. నీ జీవితంలో ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు, నీకు అర్థం కాకపోవచ్చు, గజిబిజిగా ఉండవచ్చు. అయితే మనం మన సమస్యలను దేవునికి అప్పగించి ఊరకుండుట వలన, దేవుడు మన పక్షముగా ఉండి, వాటిని సరిచేస్తాడు (కీర్తనలు 46:10). అన్ని పరిస్థితుల్లో ఇస్సాకుకు తోడైయున్న దేవుడు, నీకు కూడా తోడుగా ఉంటాడు, నిన్నెన్నడును విడు వను, ఎడబాయనని దేవుడు చెప్పుచున్నాడు. అబ్రాహామును బట్టి దేవుడు ఇస్సాకును ఆశీర్వదించాడు. అలాగే యేసుక్రీస్తును బట్టి మనలను కూడా దేవుడు జ్ఞాపకం చేసుకుంటాడు. దేవుని పోలికలోకి మనందరం సంపూర్ణులుగా మార్చ బడుదాం. ఆయన అనుమతించే ప్రతి పరిస్థితిలో ఆయన్ని నమ్ముతూ ముందుకు కొనసాగుదాం. ఆయనను వ్యక్తి గతంగా రుచి చూచిన ఇస్సాకువలె తెలుసుకుందాం. దేవుడు మనకనుగ్రహించిన వాగ్దానాలను, ఆయన మాటకు విధే యత చూపించి, విశ్వాసం ద్వారా స్వతంత్రించుకుందాం.

మనం తిన్న ఆహారం కాసేపటికే అరిగిపోయి, మళ్ళీ ఆకలేస్తుంది, ప్రతిరోజు, ప్రతిపూట ఆహారం, నీళ్ళు శరీరా నికి తీసుకోక తప్పదు. అయితే అందుకు భిన్నంగా బైబిల్లో దేవుడు ఇలా చెప్తున్నాడు. "జీవాహారము నేనే. నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు. నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు (యోహాను 6:35)". జీవాహారమైన యేసును రుచి చూచే అనుభవం నీకు కావాలా? అయితే ఆలస్యం ఎందుకు, ఇప్పుడే ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ ఇంటి వారును రక్షణ పొందుదురు (అపొ. కార్య. 16:31). ఆమేన్.

# మధ్యకాలము

ఈ విధంగా ఐగుప్తు రాజులకు యూదులు లొంగి పోయారు. టోలమీ ప్రభుత్వంలో అయిదవ సంవత్సరము నందు ఒనియాతేన్ అను యూదుల ప్రధాన యాజకుడు మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు ప్రధాన యాజకుడయ్యాడు. అతని మంచి కార్యములు క్రీ.పూ. 292 సం॥లో "ఎ క్లూన్" అను పుస్తకములో వ్రాయబడెను.

న్యాయాధిపతియైన సైమన్ తొమ్మిది సం॥లు ప్రధాన యాజకునిగా ఉన్నాడు. అతడు సునగోగుల యొక్క సహకారంతో ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, మలాకీ, 2దిన వృత్తాంతములోను పాతనిబంధనపు మతగురువుగా ఉండెను అతని కుమారుడైన ఓనియాన్ అప్పుడు చిన్నవాడు గనుక ఎలియాజరు క్రీ.పూ. 291లో యాజకుడయ్యాడు.

టోలమిసాటన్ తర్వాత అతని కుమారుడు టోలమీ ఫిలడెల్ఫిన్ క్రీ.పూ. 285లో గవర్నరుగా నియమించబడెను. ఐగుప్తులోని గొప్ప గ్రంథాలయం ఇతని తండ్రిచే స్థాపించ బడెను. అందులో గ్రీకు భాషలో తర్జుమా చేయబడిన ధర్మ శాస్త్రమును ఉంచిరి. ధర్మశాస్త్ర గ్రంథమును ఎలియాజరు అను ప్రధాన యాజకుని సమక్షములో చేసిరి.

టోలమీ ఫిలడెప్పన్ 39 సం॥లు పరిపాలించి తన 63వ యేట క్రీ.పూ.247లో మరణించెను. అతడు పాండిత్యము నందు అనుభవజ్ఞుడు. అందువలన నిపుణత గలవారందరు అన్ని ప్రాంతములనుండి ఆయన సంస్థానమునకు వచ్చి అతని యొక్క గౌరవము, అభిమానము పొందేవారు. వీరిలో థియోక్రటస్, లైకోఫ్రాన్, అలాటస్ అను కవులును, మాక్తో అను చరిత్రకారుడును ఉన్నారు.

క్రీ.పూ. 247లో టోలమీ ఎవర్గేటన్ అనునతడు తన తండ్రియైన టోలమీపాటర్ తరువాత ఐగుప్తునకు రాజాయెను. అతడు యెరూషలేమునందు –న్యాయవాది అయిన సైమన్ కుమారుడగు ఒనియాన్‌ను కనుగొనెను. ఒనియాన్ యాజ కుని దుస్తులలో ఉండి వృద్ధుడై, బలహీనుడుగా, పిరికి వాడుగా ఉండెను. మరియు ప్రధానయాజకుడు అనేక సంవత్సరాల నుండి వార్షిక పన్ను తొలగించెనని ఎవర్గేటన్ తెలిసికొని సుంకు పన్నులు చెల్లించనిచో ఎవరినైనా పంపించి వారిని దేశబహిష్కరణ గావించెదనని భయపెడుతూ మొత్తము డబ్బు వసూలు చేయమని యెరూషలేమునకు పంపెను.

ఈ వత్తిడి యెరూషలేమును అల్లకల్లోలము చేసెను. ప్రధానయాజకుని బంధువైన యోసేపు అను వ్యక్తి తన బావ యొక్క దుర్మార్గతను, అతడు జరిగించిన అన్యాయ మును గూర్చి తన అక్క పక్షంగా వ్యవహరించుచు గద్దించెను. ఒనియాన్ యొక్క అలెగ్జాండ్రియా ప్రయాణమును "మంచి దండయాత్ర" అని నిర్ధారించాడు. అతని బావగారిని నిరా కరించిన తర్వాత రాజుగారి ఉగ్రతను చల్లార్చుటకు వ్యక్తి గతంగా కలుసుకొనుటకు, నిర్ణయించుకోగా ప్రధాన యాజకుడు దానిని అంగీకరించి క్రీ.పూ. 226లో ప్రజల చేత ఆమోదించబడెను.

ఏథేనియానును యోసేపు తన స్వగృహమందు గొప్ప వినోదములతో తన సమయము గడువునట్లు చేసెను. అతడు వెళ్ళుచున్న సమయములో ఎంతో విలువైన బహుమతులతో అలెగ్జాండ్రియా దేశపు రాజు నొద్దకు పంపెను. బహుమతు లను స్వీకరించుటకు అతనిని ఆ దేశపురాజు అంగీకరిం చెను. సిరియా, ఫెనీషియా యొక్క వార్షిక పన్నులు ఆదా యాలు గురించి తెలియజేయుట ద్వారా రాజు నుండి ఎక్కువ మన్ననలను పొందగల్గెను. సిరియా, ఫెనీషియా, యూదయ, సమరియ దేశములపై మన్న రాజుయొక్క సైన్యాధ్యక్షుని కలిసికొనుటకు ఆ దేశపు రైతులతో కలిసి వెళ్ళు సమ యంలో ఈ విషయములన్నిటిని సేకరించెను. తన మామ యొక్క బాకీ విషయమై కూడా రాజును వెంటనే తృప్తి పరచెను.

(సశేషం)

# నీ సృష్టికర్త



మానవ శరీరంలో అతి ప్రధానమైనది రక్తం. ఎందుకంటే రక్తంలోని కణాలే మన జీవితాన్ని లేదా ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. 5మిల్లీ లీటర్ల రక్తాన్ని పరీక్ష చేసి శరీరంలో ఏ మూల ఏ వ్యాధి ఉందో చెప్పేయవచ్చు. ఎందుకంటే మనిషి శరీరంలో రక్తం ప్రవహించని భాగమంటూ ఏదీ లేదు. శరీర ఉష్ణోగ్రతలను కూడా రక్తంలోని కణాల సంఖ్య నిర్ణయిస్తుంది. శరీర భాగాలు సజీవ స్థితిలో ఉండి సరిగా పని చేయాలి అంటే రక్తం (రక్తంలోని ఆక్సిజన్, పోషకాలు) కావాలి. ఇలా మన శరీర స్థితిని నిర్ణయించే రక్తమును గూర్చి ఈ రోజు కొన్ని ఆసక్తికర అంశాలు తెలుసుకుందాం!

మానవ శరీరంలోని అన్ని భాగాలు కణజాల సముదాయం. అంటే ఒక కణం రెండుగా, రెండు నాలు గుగా, నాలుగు ఎనిమిదిగా, అలా విభాగింపబడిన మీదట ఏర్పడిన కణ సముదాయమే మన శరీరం. అలాగే మన శరీరంలో ద్రవరూపంలో ఉన్న కణ సముదాయమే రక్తం. ఈ రక్తాన్ని ఒక క్రమపద్ధతిలో శరీరమంతా ప్రవహింపజేయుట, శుద్ధీకరించుట వంటి కీలక పనులు నిర్వహించు వ్యవస్థను రక్త ప్రసరణ వ్యవస్థ అంటాం.

**ఈ రక్తప్రసరణ వ్యవస్థలో ముఖ్య భాగాలు:** రక్తం, గుండె, రక్తనాళాలు. ఈ వ్యవస్థ శరీరంలోని అన్ని భాగాలకు అంటే మెదడు నుండి కాలి చివరివేలు వరకు నిరంతరం అన్ని భాగాలకు రక్తాన్ని అందజేస్తుంది.

గుండె నుండి అన్ని శరీరభాగాలకు రక్తము చేర వేయుటకు సన్నని నాళాలు అమర్చబడి ఉంటాయి. ఆ నాళాల ద్వారా రక్తం గుండె నుండి శరీర భాగాలకు చేరవేయబడుతుంది. అందుకు గుండె నిరంతరం కొట్టుకుంటూ ఉంటుంది. ఆ క్రమంలో సెకనుకు 30మి.లీ రక్తాన్ని పంప్ చేస్తుంది. అంటే గుండె నుండి రక్తనాళాలోకి చేరిన రక్తం కొంత వేగాన్ని కలిగి ఉండే విధంగా పంప్ చేయబడుతుంది.

సాధారణంగా ఒక మనిషి శరీరంలో 5.5 లీటర్ల రక్తం ప్రవహిస్తుంది. రక్తం రక్తనాళాల ద్వారా శరీర భాగాలకు అందజేయబడుతుంది. ఈ రక్త ప్రసరణ వ్యవస్థలోని అన్ని రక్తనాణాలను ఒక దాని చివర ఒకటి ఉంచినట్లయితే వాటి యొక్క పొడవు 60,000 మైళ్ళు ఉంటుంది.

వాస్తవానికి భూమి చుట్టు కొలత 25,000 మైళ్ళ కంటే తక్కువ అంటే మన శరీర రక్త ప్రసరణ వ్యవస్థ భూమి కంటే దాదాపు రెండున్నర రెట్లు పెద్దది. 6 అడుగల మనిషి శరీరంలో 60,000 మైళ్ళ రక్త ప్రసరణ వ్యవస్థ అంటే ఎంత ఆశ్చర్యమో కదా!

రక్తప్రసరణ వ్యవస్థ యొక్క పని ఏంటంటే రక్తమును గుండె నుండి శరీరంలోని అన్ని భాగాలకు చేరవేయుట, మరియు కిడ్నీల నుండి చెడు రక్తమును గుండెకు చేర వేయుట. గుండె నుండి రక్తము రక్త నాళాల ద్వారా శరీర భాగాలకు చేరవేయబడి మరియు శరీర భాగాల నుండి కిడ్నీల ద్వారా తిరిగి రక్తం గుండెకు చేరుటకు పట్టే సమయం కేవలం 20 సెకన్లు.

20 సెకన్ల వ్యవధిలో రక్తం దాదాపు 1,20,000 మైళ్ల దూరం ప్రవహిస్తుంది. అంటే గుండె నుండి శరీర భాగాలకు 60,000 మైళ్లు ప్రవహించి తిరిగి అన్ని భాగాల నుండి గుండెకి చేరడానికి మరొకసారి 60,000 మైళ్లు ప్రవహిస్తుంది. అంటే రక్తం ఎంత వేగంగా ప్రవహిస్తుందో! రక్తం అంత వేగంగా ప్రవహించునట్లు గుండె ఎంత ఒత్తిడితో (ఫోర్స్‌తో) రక్తాన్ని పంప్ చేస్తుందో ఆలోచిస్తే మానవ శరీరం ఎంత అద్భుతమైన నిర్మాణమో తెలుస్తుంది.

ఎముక మధ్యభాగంలో ఉండే బోన్‌మ్యారో లేదా మజ్జా అనే మెత్తని భాగంలో రక్తం ఏర్పడుతుంది. రక్తంలో శరీర భాగాలలోని కణజాలం సజీవంగా ఉండుటకు అవసరమైన ఆక్సిజన్, హెమోగ్లోబిన్, మరియు కొన్ని రకాల పోషకాలు ఉంటాయి. రక్తంలో ఎర్రరక్త కణాలు, తెల్లరక్త కణాలు, రక్తఫలికికలు (ప్లేట్‌లెట్స్), ప్లాస్మ ఉంటాయి.

**ఎర్రరక్త కణాలకు** కేంద్రకం ఉండదు కాబట్టి, ఆ కణం మిగిలిన కణాజాలంవలె విభాగింపబడదు. ఒక చుక్క రక్తంలో 50,00,000 ఎర్రరక్త కణాలు ఉంటాయి. ఒక్కొక్క ఎర్రరక్తకణం 27,00,00,000 హిమోగ్లోబిన్ కణాలను కలిగి ఉంటుంది. ఒక్కొక్క హిమోగ్లోబిన్ నాలుగు ఆక్సిజన్ మాలిక్యుల్స్‌ను కలిగి ఉంటుంది. అంటే ఒక్క ఎర్రరక్త కణం 1,00,00,00,000 ఆక్సిజన్ అణువులను కలిగి ఉంటుంది. ప్రతి సెకనుకు కొన్ని లక్షల ఎర్రరక్త కణాలు చనిపోతుంటాయి. ఎర్ర రక్త కణాలు డిస్క్ ఆకారంలో ఉండి ఆక్సిజన్ కణాలను శరీర భాగాలకు మోసుకెళ్తుంటాయి. ఒక్కో ఎర్రరక్త కణం 120 రోజులు మాత్రమే జీవించి ఉంటుంది. చనిపోయిన ఎర్రరక్త కణాలు కిడ్నీల ద్వారా విసర్జింప బడతాయి. వాటిస్థానే కొత్త ఎర్రరక్త కణాలు పుడుతుంటాయి. ఈ ఎర్రరక్త కణాల నిర్మాణంలో ఉండే వ్యత్యాసాలను బట్టే వేరు వేరు బ్లడ్ గ్రూప్స్‌గా గుర్తిస్తారు.

**తెల్లరక్తకణాలు** మన శరీర రక్షణ వ్యవస్థలో భాగం. శరీరంలోకి అడుగిడిన హానికరమైన బాక్టీరియాతో యుద్ధం చేసి వాటిని చంపి శరీర స్థితిని యథాతథంగా కాపాడేందుకు ఉపయోగపడుతుంది. ఒక క్యూబిక్ మిల్లీ లీటర్ రక్తంలో 4,000 నుండి 10,000 తెల్లరక్త కణాలు ఉంటాయి. తెల్ల రక్త కణాల నిర్మాణాన్ని అనుసరించి తెల్లరక్త కణాలలోను విభాగాలు ఉన్నాయి.

**రక్తఫలకలు లేదా ప్లేట్‌లెట్స్:** ఒక క్యూబిక్ మిల్లీ లీటర్ రక్తంలో 1,50,000 నుండి 4,10,000 ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఇవి గాయపడిన శరీర భాగాలను పునరుద్ధరించడంలో ఉపయోగపడతాయి. గాయపడిన శరీర భాగం నుండి వెలువడిన రక్తంలోని ప్లేట్‌లెట్స్ అన్ని ఒక దగ్గరకు చేరి వలయంగా ఏర్పడి మరింత రక్తం బయటకు పోకుండునట్లు అడ్డుకుంటాయి. ఈ కణాల సంఖ్య పెరిగినా తరిగినా అది వ్యాధి కారకంగా మారుతుంది.

ఇలా చెప్పుకుంటూపోతే రక్తమును గురించి, శరీరంలోని ఒక భాగమైన రక్తప్రసరణ వ్యవస్థ గురించి చెప్పుకొనుటకు మన జ్ఞానము సరిపోదు. మరి అటువంటి అద్భుతమైన వ్యవస్థ నీ శరీరంలో ఒక భాగంగా ఏర్పరచిన సృష్టికర్త ఇంకెంతటి అద్భుతకరుడో మాటల్లో చెప్పజాలనిది.

నీ సృష్టికర్తయైన దేవుని ఘనపరచుటకు, ఆయనకు కృతజ్ఞత కలిగి ఉండుటకు దేవుడు నీకిచ్చిన ఈ దేహము గురించి కొంత తెలుసుకుంటే చాలు. దేవుడు ఉచితంగా ఇచ్చిన ఈ శరీర నిర్మాణం వెలకట్టలేనిది. అద్వితీయమైనది. కాబట్టి నిన్ను సృష్టించిన సృష్టికర్తపట్ల కృతజ్ఞత కలిగి యుండటమే కాక ఆయన శక్తిసామర్థ్యాలను బట్టి ఆయనకు భయపడి జీవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుసుకొని మసలుకో.

### చందాదారుల వివరములు

1. రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
2. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
3. శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
4. అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
5. డా॥ సిహెచ్‌కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
6. జయ, గుంటూరు - 1500/-
7. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
8. కె. రజిని, నరసరావుపేట - 1000/-
9. వి. కస్తూరి, భీమవరం 500/-
10. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
11. పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
12. బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
13. నైటింగేల్, నెల్లూరు - 500/-
14. మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
15. డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల - 500/-
16. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
17. జి. కళావతి, ఒంగోలు 350/-
18. శ్రీమతి కె. కల్పన, గోవా - 350/-
19. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
20. శ్రీమతి సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట- 350/-
21. కె. రాజేష్, రాజమండ్రి - 350/-
22. శ్రీ యస్. గోపి, పార్వతీపురం - 350/-
23. పి. దేవదానం, గుంటూరు - 300/-
24. పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
25. ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-

సాక్ష్యము

# వెలుగైన నా రక్షణ కర్త

నా పేరు సునీత. మేము హిందూ సాంప్రదాయానికి చెందినవారము. వెంకట సుబ్బమ్మగారు, మా అమ్మమ్మ గారు. మా అమ్మమ్మ, వారి పంతులమ్మ గురవమ్మ గారి ద్వారా బాల్యంలోనే క్రైస్తవ విశ్వాసాన్ని ఎరిగినవారు. క్రీస్తే మార్గము, సత్యము, జీవమని అంతేకాక సత్యమును మీరు తెలిసికుంటారు, సత్యము మిమ్ములను స్వతంత్రులను చేస్తుంది అని ఎవరో బోధించడంతో మా అమ్మమ్మగారు క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించారు.

నేను యవ్వనంలో అడుగు పెట్టిన రోజులో దేవున్ని నమ్మాను. మా అమ్మమ్మ నాకు దేవుని యెడల విశ్వాసాన్ని గూర్చి సజీవుడైన దేవుని నమ్మడం సంపూర్ణ సమర్పణా జీవితమనియు, కేవలం ఆచార వ్యవహారాలు పూజలు కాదనీ, నిజదేవున్ని చేరాలంటే బైబిలు మాత్రమే మార్గమని అనునిత్యం చెప్పేవారు. ఈ సత్యాలన్నీ నేను పూర్తిగా నమ్మాను. అప్పట్లో నా వయస్సు 19 సం॥లు. నా సహాధ్యాయులతో కాలేజీ విహారయాత్రపై ప్రముఖ హిందువుల పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశి) దర్శించాలని వెళ్ళాము. అప్పటికే పూజలు చేయని నేను క్రీస్తులో విశ్వాసిని గనుక నా హృదయం చాలా కలవరంతో నిండిపోయింది. ఆ దేవాలయాన్ని దర్శించడానికి యిష్టపడలేదు. కానీ నా తరగతిలో స్నేహితులతో పాటు వెళ్ళడం తప్పలేదు. పూజకు కావలసిన సామాగ్రి అందరితో పాటు కొన్నాను. అందరితో పాటు దేవాలయంలో పూజలో పాల్గొన్నాను. ప్రతి పని పూర్తి చేసికొని నా గదిలో చేరాను. ఆ రాత్రి నాకు కలత నిదుర పట్టింది. ఆ తర్వాత ఒక దర్శనాన్ని చూచాను. నేనొక గదిలో బంధీనైనట్లుగా ఆ దర్శనంలో చూచాను. గది నాలుగు మూలలా హిందూ దేవతల చిత్రపటాలు తగిలించి అందంగా అలంకరింపబడి ఉన్నాయి. ఆ పటాలన్నీ నా కళ్ళ ముందే తీవ్రంగా కదలాడి నన్ను కలతపెట్టసాగాయి. నేను మౌనంగా యేసుక్రీస్తును ప్రార్థించసాగాను. దేవుడెందుకు నాకీ అవకాశం కల్గించాలి? నేను నమ్మకపోయినా ఈ ప్రయాణం ఎలా కొనసాగించాను? యిలా ఆలోచిస్తూ, నేను ప్రార్థిస్తూ ఉండగనే తక్షణం, గొప్ప కాంతి ఒక మూల నుండి ప్రకాశవంతంగా విరజిమ్ముట ఆరంభమైంది. కొద్ది సేపట్లోనే ధగధగమనే కాంతివంతమైన వెలుగుతో ఆ గదంతా నిండిపోయింది. అప్పుడు నాకు ఆ దర్శనం అర్థం కాలేదు.

మా నాన్నగారికి విశాఖపట్నంలో ఉద్యోగం వచ్చింది. నేను, అమ్మ,నాన్నగారు విజయవాడ వచ్చినపుడు బంధువుల మధ్య కొంత కాలం గడిపి దేవుని పుస్తకాలు ఆత్మీయాహారానికి అనువైన వనరులన్నీ అందుకునేవారం. కొన్ని సం॥రాల క్రితం నేను గతంలో ఆ వెలుగును గూర్చిన దర్శనం విశ్వాసులతో పంచుకోగా వారు, దేవుని ఆశీర్వాదమని, "నీకు వెలుగు వచ్చియున్నది. లెమ్ము తేజరిల్లుము యెహోవా మహిమ నీ మీద ఉదయించెను" "మనుష్యులు మీ సత్క్రియలను చూచునట్లు వారి యెదుట మీ వెలుగును ప్రకాశింపనీయుడి" అనే వాక్యాలతో నన్ను ఆదరించారు.

అదే దేవుని ఉనికిగా, నా రక్షణ స్థిరతగా గుర్తించాను. యెహోవా నాకు వెలుగాయెను. యెహోవా నాకు రక్షణాయే. నా ప్రాణ దుర్గమయ్యెను. నేనెవరికి ఎన్నడు భయపడను. ఆ పాట గుర్తుకు వచ్చింది. హెబ్రీ.13:5, నిన్ను ఏ మాత్రము విడువను. నిన్ను ఎన్నడు ఎడబాయను అని ఆయనే చెప్పెను కదా, కాబట్టి ప్రభువు నాకు సహాయకుడు, నేను భయపడను. నరమాత్రుడు నాకేమి చేయగలడు? వంటి దేవుని వాక్యాలన్నీ నాకు చాలా ధైర్యమిచ్చాయి. దేవుడు నాతో ఉండి నడిపించి నా యెడల శ్రద్ధ కలిగియుండుట నాకెంత నిబ్బరం! ఈ క్రొత్త సంతోషం నాకు మరింతగా విశ్వాసం కల్గించింది. అప్పటి నుండి అన్ని నమ్మకాల నుండి దూరమై క్రీస్తును మాత్రమే వెంబడించుటకు నిశ్చయత కలిగి ఉన్నాను.

1995 సంవత్సరములో ప్రముఖ ధనికుడైన డాక్టరు గారి అబ్బాయి, అతను కూడా డాక్టరే, వారితో నాకు హిందూ పద్ధతిలో వివాహం జరిగింది. మా అత్తగారి బంధువులంతా హిందువులు గనుక నా విశ్వాసాన్ని గూర్చి వారికి తెలియదు. నా విశ్వాసం వారి మధ్య భయంతో సడలిపోసాగింది. అంతలో బాబు రోహన్ పుట్టాడు. విధి వశాత్తు మరొక దుర్ఘటన.

నా భర్త ఆకస్మిక మరణము. నా భర్త డాక్టరు కోర్సులో పి.జి. చదివేరోజుల్లోనే జరిగింది. నిశ్చేష్టురాలిగా నిలిచాను. నేను విశాఖలో ఫార్మసీలో డిగ్రీ చదివాను. దేవుడు సదా నాతో ఉన్నాడు. నా చదువు, ఉద్యోగము అన్నింటిలో నన్ను ఉన్నతస్థానంలో నిల్పారు. ఒంటరిగా బాబుతో అమెరికా చేరాను. అమెరికాలో ఫార్మసీలో పెద్ద ఉద్యోగం కొరకు ప్రయత్నించగా వెంటనే లభించింది. దేవుడే నాకు వెలుగుగా దారి చూపియున్నారు. ధైర్యంగా ఉద్యోగం చేస్తూ బాబును చదివించుకోగలిగాను.

అయితే నేను ఒంటరి పిచ్చుకగా, యవ్వనంలో విధవగా జీవిస్తూ దేవుని శిలువను ఆశ్రయించి నా భవిష్యత్తుకై ప్రార్థిస్తూ ఉండగా, మరొక దర్శనం కల్గింది. ఈసారి వింత కాంతి కన్పించి, నా బాబును నా నుండి దూరంగా తీసికొని పోతున్న దృశ్యం. ఎందుకో నా వెనుకగా కొందరు మనుష్యులు ఏడుస్తూ నిలిచారు. నేను మరొకసారి భారంతో ప్రార్థించి నా జీవితాన్ని క్రీస్తు పాదాలపై సమర్పించి సంపూర్ణంగా మొదటి విశ్వాసంతో నిలబడ్డాను. దేవునితో నా నడకను క్రమపద్ధతిలో నడిపిస్తూ దేవుని సన్నిధిని అతి సన్నిహితంగా రోజూ వెదికాను.

నాకొక మంచి స్వంత యిల్లును దేవుడిచ్చారు. నా బాబు చదువు సవ్యంగా సాగిపోతుంది. నాకీ జీవితం చాలు ప్రభూ అని స్తుతిస్తున్న నాకు ఆకస్మాత్తుగా సైతాను శ్రమతో నన్ను కృంగ దీసింది. భయంకరమైన తలనొప్పి, అసహనం అవరించాయి. ఒకరోజు వాంతితో తల తిరగడం జరిగింది ప్రమాద పరిస్థితుల్లో 911 ఫోన్ చేయగా, పోలీసు వారి సహాయంతో హాస్పిటల్‌లో చేరడం జరిగింది. వెంటనే వైద్య పరీక్షలు జరిపారు. మొదట నరాల బలహీనత అనిపించింది, గుండెపోటు వంటి బాధ కలిగాయి. చివరకు వైద్య పరీక్షల ఫలితంగా మెదడులో కణిత అన్నారు. దానికి తేదీ నిర్ణయించి ఆపరేషన్‌కు సిద్ధంచేసారు. నా కొరకు ఎందరో ప్రార్థించారు. నా ఆఫీసు యాజమాన్యం నన్ను వెన్నంటి తోడుగా ఉండు నట్లు, నా ఏకాంత జీవితంలో ఆలంబనగా దేవుడే వారిని నిలబెట్టారు. వారి ప్రార్థనా సహవాసం తగిన ధైర్యాన్నిచ్చి ఎంతగానో ఆదరించింది. నా కొడుకు రోహన్ చాలా నిబ్బరంగా ధైర్యంగా ఉంటూ నాకు సహకారిగా ఉన్నాడు. మా తల్లిదండ్రులు అమెరికా వచ్చి నాకు అండగా నిలిచారు. ఇదంతా ప్రభువు సంకల్పంతో ఆత్మీయుల ఆదరణ నిచ్చి పూర్తిగా స్వస్థతనిచ్చి అతి స్వల్ప వ్యవధిలో తిరిగి ఉద్యోగంలో ప్రవేశించే అర్హత నిచ్చారు. నిశ్చయంగా యిది నా జీవితంలో జరిగిన అద్భుతమే. దేవునికి ఎంతగానో కృతజ్ఞత తెల్పాను.

నాకైతే ఈ అనుభవాలన్నీ అసమానమైన ధైర్యాన్ని కలిగించి నిబ్బరంగా క్రీస్తు విశ్వాసంలో నిలిచియుండే రీతిగా నన్ను స్థిరపరిచాయి. ఒకరి జీవితంలో ఏ స్థితికైనా, క్రీస్తు ప్రభువు తప్ప మరెవ్వరూ గొప్ప రక్షకునిగా ఉండతగడు.

క్రీస్తును నమ్మిన చదవరులందరకూ నేను చాలా నిశ్చయతతో ప్రోత్సహించే సత్యమేమనగా జీవితంలో స్థిరంగా క్రీస్తుతో ఉండి సాగిపోవాలని. జీవితంలో ఎట్టి శ్రమలు, సవాళ్ళు ఎదురైనా, అవాంఛనీయమైన ఆకస్మిక విపత్తులు సంభవించినా, ఏ రకమైన గందరగోళ పరిస్థితులెదురైనా, దేవుడైన క్రీస్తుకుగల పరిశుద్ధాత్మ శక్తికి మించినది ఏ శక్తీ యీ లోకంలో లేదు. *శక్తి చేతనైనను, బలముచేతనైననుకాక, నా ఆత్మచేతనే ఇది జరుగును. జెకర్యా 4:6-7*


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

ఆధునిక దృక్పథం

# క్రొత్త కోణాలు

## జక్కయ్య ఉదంతం

**పొట్టి జక్కయ్య మీద ఎన్నో ప్రసంగాలు వింటాం, వ్యాఖ్యలు చదువుతాం. తద్వారా మనకు కలిగే సాధారణ అవగాహన – జక్కయ్య ఒక కిరాతక రోమా కిరాయి సుంకరి అని, సాదా ప్రజల నోరు కొట్టి ధనవంతుడయ్యాడని, పరమ పాపిష్టి అని! అట్టి నీచుణ్ణి యేసు సంధించాడని, తత్కారణంగా తన అక్రమ ఆస్తిలో బీదలకిస్తానన్నాడనీ, అన్యాయంగా తీసుకొన్న దానికి నాలుగు రెట్లుగా తిరిగి ఇస్తానన్నాడని, దానితో అతని యింటికి రక్షణ వచ్చిందని యేసు కితాబు ఇచ్చాడని. ఎందుకో జక్కయ్య మీద దురభిమానం ఏర్పరచుకుంటారు. ధనవంతులంతా పాపులు, బీదలంతా కాదని కూడా అనుకుంటారు. ధనవంతులకే పాప క్షమాపణ అవసరమని కూడ లోలోన తీర్పు తీరుస్తారు!**

అందుకు ప్రతిగా జక్కయ్య ఉదంతాన్ని క్రొత్త కోణాల్లో చూద్దాం. జక్కయ్య ఉదంతం ఒక ఉపమానం కాదు. అది ఒక వాస్తవ ఘట్టం. అంటే దానికి మన యిష్టం వచ్చిన భాష్యం చెప్పటానికి అదొక 'ఆర్టబాన్' లాంటి ఊహా సృష్టి కథకాదు. కనుక బైబులులో చెప్పిన మాటల మేరకే అతనిని అర్థం చేసుకొందాం.

అసలు జక్కయ్య అనే పేరుకు హెబ్రీ భాషలో పవిత్ర (Pure), నీతిగల (Righteous) అని అర్థం. అతడు పొట్టి వాడని బైబిల్లో ఉందిగాని జిత్తులమారి అనిలేదు. శారీరకంగా పొట్టివాడని ఉందిగాని ఆత్మీయ కురచదనం ఉందని లేదు.

తెలుగు బైబులులో అతడు సుంకపు గుత్తదారుడనే ఉంది. కాని ఇంగ్లీషు బైబులులోవలె 'Chief' అని లేదు. గుత్తదారుడు అంటే ఒక పనిని గుత్తకు (Contract) తీసు కొన్నవాడని. అంటే రోమీయులకు ముందుగానే నియమిత ధనం గుత్తగా చెల్లించి ఆ ప్రాంతంలో పన్నులు వసూలు చేసే కాంట్రాక్టు పనివాడని. అంటే అతడు వస్తుతః ధనికుడై యుండాలి. పన్నులు వసూలు చేయటంలో లాభం ఉంటుంది. కాని, రోమీయులు నిర్ణయించిన రేట్లకన్నా ఎక్కువ వసూలు చేస్తే వారు ఊరుకోరు. అతడు ప్రజలను పీడించి, వేధించి అక్రమంగా సంపాదించాడని బైబిల్లో లేదు. కనుక, అతడు కేవలం వృత్తిరీతిగా రోమీయుల కొలువులో ఉన్న యూదుడే గాని అనాచార భ్రష్టుడైన యూదుడనే ధ్వని బైబిల్లో లేదు. మత్తయి(లేవి) కూడా సుంకరియే. యేసు పిలువగానే వెంబడించినవాడు. కనుక, సుంకరులందరు చెడ్డవారని కాదు.

అయితే, ఆనాటి యూదుల దృష్టిలో మాత్రం పన్ను వసూలు చేసే వృత్తిలో ఉండే యూదులంటేనే అసహ్యం. యూదులను బానిసలుగా అణగార్చే దొరతనానికి వారు తొత్తులనే కాకుండా అక్రమంగా పై సంపాదనకు అవకాశం ఉండే కొలువులో ఉండేవారని కూడ వారిని అపరిశుద్ధులుగా ఎంచేవారు. వారితో 'భక్తిపరులైన' యూదులు సాంగత్యము చేయరు. మత్తయి ఇంటికి భోజనానికి కూర్చున్నప్పుడు కూడ పరిసయ్యులు యేసును తప్పుపట్టారు. 'సుంకరులు పాపులు' అనేది వారి సమీకరణం (మత్త. 9:10). అదొక దురభిమానం.

ఆ మాటకొస్తే పాపులు కానివారెవరు? బైబులు ప్రకారం, 'నీతిమంతులు లేరు, ఒక్కడును లేడు' (కీర్తన. 14:2–3, రోమా 3:10–12) వంటి అనేక వచనాలు లేవా? కేవలం కొన్ని బాహ్యాచారాలు, పారంపర్యాచారాలు చేసినంత మాత్రానే పరిసయ్యులు పరిశుద్ధులు, సుంకరులు పాపులు అవుతారా?

అయితే, యేసు కూడ ధనవంతులంటే మంచి అభి ప్రాయం కనపరచలేదు (లూకా 12:16–26, మత్తయి 19: 16–26), 'ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట కంటే సూది బెజ్జములో ఒంటె దూరుట సులభము'ని యేసు చమత్కరించాడు (మత్త. 19:24). అయినా, యేసుకు, పరి సయ్యులకు (ఈనాటి బోధకులకు) ముఖ్య వ్యత్యాసమేమంటే –అట్టి ధనవంతుల వద్దకు, పాపులని కేటాయింపబడిన వారి యొద్దకు యేసు వెళ్ళాడు. ఈనాటి బోధకులు ధనవంతుల దగ్గరకు పోతారేమోగాని, 'పాపుల' యొద్దకు పోతారో, లేదో?

జక్కయ్య అక్రమ ఆస్థిపరుడనటానికి ఆస్కారమిచ్చింది ఆయన మాటలను అపార్థం చేసుకోవటం వల్లనో యేమో! ఆనాడు ప్రభువు సమక్షంలో రెండు గంభీర ప్రకటనలు చేశాడు ఆయన.

1. 'నా ఆస్థిలో సగము బీదలకిచ్చుచున్నాను' (వ8).

జక్కయ్య ఆస్థి అక్రమ సంపాదన అయి ఉంటుందని మనం అంచనా వేస్తుంటాం. కాదని నా మాట. బీదల (అక్కరలో ఉన్నవారి) కిచ్చేది దేవునికిచ్చినట్లు. 'మిక్కిలి అల్పుడైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను' (మత్త. 25:40). జక్కయ్య ఆస్థి అక్రమ సంపాదనైతే యేసు దానిని అంగీకరిస్తాడా? ఆది. 14:21-24లో సొదొమ రాజు యుద్ధంలో వచ్చిన దోపుడు సొమ్మును అబ్రాహామున కియ్య బోగా అందులో ఒక్క నూలుపోగైనను తీసుకోలేదు. అదే అబ్రాహాము తన (క్రమసంపాదన) అన్నిటిలో మెల్కెసెదెకునకు పదియవ వంతు ఇచ్చెను (వ20). కనుక, జక్కయ్య తన ఆస్థి దోపుడు సొమ్ము కాదని తెలిసియే ఆ విధంగా ప్రదానం (offer) చేశాడని నా వాదన!

2. 'నేనెవని వద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసు కొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతును (వ8) అన్న మాటలు చదివి, ఆహా, అతడు లోకుల సొమ్ము అన్యా యంగా తీసుకోబట్టే అలా అన్నాడని మనం దుడుకైన నిర్ణయా నికి వస్తాం. దానినే ఒక క్రొత్తకోణంలో పరిశీలిద్దాం. ఈ రెండో ప్రతిపాదన చేసేసరికి తన ఆస్థిలో సగమే తనకు మిగులుతుంది. ఈ ఆస్థి అక్రమంగా తీసుకొన్నదైతే దానిని తిరిగి ఇవ్వటానికి నాలుగంతల ఆస్థి కావాలి. అది ఎక్కడ నుండి వస్తుంది? అలాంటి చెల్లించుకోలేని (vel) ప్రతిపాద నలు యేసు ముందా? లేక కొంత భాగం దోపుడు సొమ్ము యితే అది మొదటి సగంలో భాగమై యుండదా! ఈ కారణా లనుబట్టి, జక్కయ్య ఈ ప్రకటనను ఒక వినయ పూర్వక సవాలుగా చేసినట్లని నా భావన. IFతో మొదలుపెట్టే సవాళ్ళు వ్యతిరేకార్థం కూడ ఇస్తాయి. కనుక జక్కయ్య, ప్రభువు 'ఎదుట నేను ఎవరి దగ్గర ఏమీ తీసుకోలేదు ప్రభూ! ఒకవేళ (if) తీసుకొని ఉంటే మాత్రం దానిని వారికి నాలుగు రెట్లుగా తిరిగి ఇచ్చివేస్తాను', అని.

'ఈ 'నాలుగురెట్ల'నేది మోషే ధర్మశాస్త్రంలో ఒక గొఱ్ఱెను దొంగిలించి, దానిని అమ్మినా, చంపినా అందుకు పాప ప్రాయ శ్చిత్త పరిహారంగా నాలుగు గొఱ్ఱెలనియ్యాల్సి ఉంది (నిర్గ. 22:1). అలాంటి ధర్మశాస్త్ర నిష్ణాతుడు జక్కయ్య అని నా భావన. కనుక, జక్కయ్య వృత్తికి సుంకరియేగాని ప్రవృత్తిలో గాని, చిత్తశుద్ధిలోగాని వేషధారులైన పరిసయ్యుల (బోధకుల) కన్నా సదాచారి, దైవభయంగల మంచి యూదుడని నా భావన. అందుకే యేసు 'ఇతడును అబ్రాహాము కుమారుడే' అని స్వయంప్రేరకం (spontaneous)గా కితాబు ఇచ్చాడు.

క్రొత్తకోణాల్లో ఈ ఉదంతాన్ని చూడటంవల్ల మనలో కొన్ని సరిక్రొత్త ఆలోచనలు కలగాలి.

**మొదటిది:** ఒకరు 'పాపి' అయ్యేది ధనవంతుడైనందున లేక వృత్తి (సుంకరి) వలన కాదు. దేవుని ఆజ్ఞలను మీరిన వారు పాపులౌతారు. పాపులనేవారు ప్రత్యేక తెగకాదు. 'ఏ బేధమునులేదు అందరును పాపముచేసి దేవుడు అనుగ్ర హించు మహిమను పొందలేక పోవుచున్నారు' (రోమా 3:23).

**రెండవది:** పాపి ఎవరైనా, పాపమెంతదైనా యేసును చేర్చు కొనుట ద్వారా పరిశుద్ధులుగా తీర్చబడతాం. అందుకు మారు మనస్సు ప్రధానం. మారుమనస్సును ఎన్నో విధాలుగా నిర్వచింపవచ్చు. అయితే, యేసులేని దశ, దిశలో ఉన్నవారు యేసుగల దశ, దిశలో ప్రవేశించుటకు నిశ్చయించుకొను టయే మారుమనస్సు. దానికి మొదటి మెట్టు జక్కయ్యవలె ఒక త్యాగం చేయుట. తనకు ఆటంకమైన ఆస్థిని వదులు కోటానికి సిద్ధమయ్యాడు. మనం కూడ మనకవసరంలేని పొగత్రాగుట, మద్యం త్రాగుట మొదలైన వాటిని త్యజిం చటం ద్వారా మొదటి మెట్టు తీసుకోవచ్చు. కొందరు అతి వాదులు అన్ని అనర్థాలు వదిలి క్రైస్తవులమౌతామంటారు. అది ఒక మిధ్య, భ్రమ. మనలో రక్తమాంసాల రసాయనమే పాపం కనుక మనలో రక్తమాంసాలు చలనత్వంలో ఉండేంత వరకు ఏదో ఒక పాపం ఉంటూనే ఉంటుంది - వ్యభిచారం, నరహత్యలాంటివి కాకపోవచ్చు. ఆశామోహాలు, అసూయ మత్సరాలు మొదలైన కంటికి కానరాని పాపాలు కావచ్చు. కనుక, మనం తొలిమెట్టు తీసుకోవాలి, ఆ దశలో, దిశలో ఎదగటానికి ప్రాకులాడాలి - దేవుని కృపలో, విశ్వాసంలో.

**మూడవది:** 'ఇతడు అబ్రాహాము కుమారుడే ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది' (వ9)అని చదవ గానే, జక్కయ్య అబ్రాహాము కుమారుడు కనుక అతనికి రక్షణ వచ్చినది అన్నట్లు తలస్తాము. దానికి కారణం పాత నిబంధన బోధ. దేవుడు అబ్రాహాము సంతతికిచ్చిన వాగ్దానం. కాని, ఇక్కడ చెప్పింది, ఈ యింటికి రక్షణ వచ్చినది, ఆ కారణంగా ఇతడు అబ్రాహాము కుమారుడే. అనగా, రక్షణ

క్రీస్తే, ఆ క్రీస్తే ఆనాడు జక్కయ్య యింటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన మాత్రానే కాదు. జక్కయ్య ఆయనను స్వీకరించాడు, అందుకు గుర్తు ఒక మారుమనస్సు క్రియావాగ్దానం చేశాడు. అందువల్ల అతడు అబ్రాహాము కుమారుడు-రక్షణకు సంకేత మైన కనాను (పరమకనాను) వాగ్దత్తపుత్రుడయ్యాడు. కేవలం క్రైస్తవ మతస్థుడైనంత మాత్రాన రక్షణకు పాత్రులు కారు.

**నాల్గవది:** అన్నిటికన్నా నన్ను కలచివేసేది - యేసు, జక్కయ్య యింటికి పోతే, 'పాపి' యింటికి పోయాడని వెలుపల నిలిచి కారుకూతలు పలికిన స్వనీతిపరులైన 'అందరు', అంటే శాస్త్రులు, పరిసయ్యులు (బోధకులు) అగ్రగాములు సుమా! ఈ ధోరణిలో 'విశ్వాసులు', 'బోధకులు', 'సంఘాలు' ఉంటు న్నారు. వీరు ఒక ప్రత్యేక కూడికగా ఏర్పడి, తాము పరిశు ద్ధులమని, యితరులు పాపులని వ్రేలు పెట్టి చూపుచున్నారే. కాని 'పాపులైన' వారింటిని వెదకుచూ పోవుచున్నారా? వారిలో మార్పు తెచ్చుటకు ప్రయత్నించుచున్నారా?

'అగణ్య పాపియని త్రోయక -న
న్ను గూర్చి తన సుతుని దాచక
తెగించి మృతికొప్పగించి పాపపు
నెగుల్ దిగుల్ సాగ-సుగా ననంచెను'

అన్న పురుషోత్తము చౌదరి మాటలు గుర్తుకు రావా? క్రీస్తు తన మహా వైభవోపేతమైన స్థితి (ఫిలి. 2:6-8) ని విడిచి, రిక్తునిగా పాపులను రక్షించుటకు ఈ పనికిమాలిన లోకము లోనికి రాగా నేటి గుడి కామందులు, సహవాసముల 'పరిశు ద్ధులు', పాపులను వెదకుచు పోవుచున్నారా? లేక వారిని వదలి వేయుచున్నారా?

**"నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" లూకా 19:10**

భారతదేశంలో 97.5% క్రీస్తు వారు కారు. 2.5% క్రైస్తవులని పేరు పెట్టుకొన్నవారు. గుడులకు, సహవాసాలకు క్రమము తప్పక హాజరయ్యేవారు, సువార్తను చాటవలసి నదిగా ఉత్తర్వు పొందిన సువార్తికులు, శిష్యులు, విశ్వాసులు. మన ప్రస్థానం గుడి గోడలేనా? చెట్టెక్కి క్రీస్తును చూడగోరు పొట్టి జక్కయ్యల ఇండ్లకు పోయి వారి యింటికి రక్షణ కొనిపోవుటే కదా!

**వచ్చే మాసం: నా పొరుగు వాడెవరు?**


## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యథార్థ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ.150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# కృపాదానం

విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజ స్వరూపమును అదృశ్యమైనవి ఉన్నవనుటకు రుజువునై యున్నది. అదృశ్యమైనవి ఉన్నవని విశ్వసించినపుడే, దేవుని శక్తి ప్రతి మానవుని తనతో సహవాసంలో పెంచుట దేవునికి ఇష్టమైయున్నదని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు.

దోనె ఎక్కి బేత్సయిదాకు వెళ్ళమని ప్రభువు తన శిష్యులు 12 మందిని బలవంతంగా సాయంకాల సమయాన పంపించాడు. అయితే వీరు కపెర్నహూము తట్టు ప్రయాణం చేసి, రాత్రంతా తుఫానులో గడిపారు. తెల్లవారుజాముున ప్రభువు నీళ్ళమీద నడుస్తూ వారి దగ్గరకు వచ్చాడు. శిష్యులందరు భయపడ్డారు. ప్రభువు వారిని పలకరించి నప్పుడు వారికి ధైర్యము వచ్చింది.

పన్నెండుమంది శిష్యులలో పేతురు ఒక్కడే ప్రభువుతో నీళ్ళమీద నడవాలన్న కోరికను బయలు పరిచాడు. ప్రభువా! నీకిష్టమైతే, నీళ్ళ మీద నడచి నీ వద్దకు వచ్చుటకు నాకు సెలవిమ్మని అడిగాడు. ప్రభువు రమ్మన్నాడు. భూమి పుట్టిన తర్వాత మనకు తెలిసినంత వరకు నీటిమీద నడచిన మానవుడు పేతురుగారు మాత్రమే. విశ్వాసంతోనే కొంత దూరం నడిచాడు. ఎంతదూరం నడిచాడు అన్నది ముఖ్యం కాదు. మానవుడు చంద్రమండలానికి వెళ్ళాడు, కాని నీళ్ళ మీద నడవటం (ఏ సాధనం లేకుండా) సాధ్యం కాలేదు. అంతకుముందు అయిదు రొట్టెలను రెండు చేపలను తమ చేతులతోనే వేలమందికి పంచారు. అది అద్భుతమే. కాని అది ప్రభువు ఇచ్ఛ. ఇప్పుడు ఇది ప్రభువు ఆలోచన కాదు. పేతురుగారికి మాత్రమే మనసులో పుట్టింది. ప్రభువును అడిగాడు, నమ్మాడు, నడిచాడు.

ఫలవంతమైన మంచి వ్యాపారం, మంచి ఆదాయం, భార్య టీచరు ఉద్యోగం, పదిమంది పిల్లలు, కంపెనీ కారు, డ్రైవరు, ఇంకేం కావాలి?

దేవుని మహిమను చూడాలి. ఇతరులకు చూపించాలి అనే ఆలోచన కృపాదానంలో, ఆయన భార్యలో కలిగింది. అమెరికా దేశముకాని మరే ఇతరదేశం వలన ధనవంతులు అవ్వాలని, అసలు ఆ రోజుల్లో అటువంటి ఆలోచన దక్షిణ కోస్తాలో ఎవరికి లేదు. ప్రతి పట్టణంలోను విదేశస్తులు నలుగురైదుగురు కాపురమున్నారు. బీద క్రైస్తవులకు సహాయం చేస్తున్నారు. అయితే ఒంగోలులో నివశిస్తున్న అయిదు అమెరికా కుటుంబాలు మరికొందరు విదేశీ యవ్వనస్తుల ఆలోచనలకు వ్యతిరేకంగా ఉద్యోగాలు మానివేసి విశ్వాసంపై ఆధారపడి సేవచేసి బీద పోవాలనే ఆలోచన వారికి నచ్చలేదు. అలా కృపాదానం దంపతులిద్దరూ వారి ఉద్యోగాలు వదిలి అన్యజనుల మధ్య రక్షణ సువార్త ప్రకటించటం సాహసమే! అందువలన ఒంగోలు పట్టణంలో పండుగలలో ఇంకా కొన్ని సందర్భాలలో తెల్లదొరలు ఇచ్చే బహుమానములు వదులుకోవాల్సి వచ్చింది. 1957 నుండి విశ్వాస జీవితంలో అడుగుపెట్టిన కృపాదానం దంపతుల వెంబడి దేవుని మహిమ వెంబడించింది.

నీవు నమ్మిన యెడల దేవుని మహిమ చూతువని నీతో చెప్పలేదా అని ప్రభువు బేతనియ మార్తతో అన్నాడు.

కొడవటికంటి కృపాదానం దంపతులు విశ్వాస జీవితం ప్రారంభిం చిన తర్వాత ప్రతిరోజు దేవుని మహిమను చూచారు. వారి పెద్దకుమారునిగా నేను వారి జీవితాలను గమనించి విశ్వాసంలో ఎదగటానికి ప్రభువు అంగీకరించిన తర్వాత సాధ్యమైనది. అందుకుగాను అనేకమందితో ఈ విషయాలు పంచుకుంటున్నాను.

నా జీవితం గుంట నుండి మింటికి అనే పుస్తకము ద్వారా ప్రారంభించబడి, విశ్వాసంలో ఓ మెట్టు, విశ్వాసంలో మరోమెట్టు, విశ్వాసము విజయము అనబడు గ్రంథాల ద్వారా ప్రచురించబడుతుంది. అమెరికా డబ్బుతో అడుగంటిన విశ్వాస జీవితంను 2000 సం॥ ప్రారంభంలో ప్రభువు దర్శనముతోనే ప్రక్షాళన గావింపబడినది.

కుటుంబమనేది దేవుడు సృష్టించిన జీవరాసులలో మానవునికే పరిమితమైనది. భార్య, భర్త ఇద్దరు కలిసి నడుపవలసిన సంస్థ. ఇది దేవుని వలన స్థాపింపబడు చున్నది. దీనికి పరిమితి ఏర్పాటు చేసుకొనే మానవుడు దేవునికి వ్యతిరేకి. కుటుంబంలో ఉన్న పిల్లలు పెద్దలు అందరు కనీసం 20 సంవత్సరాలైనా ఒకే ఇంట్లో జీవించాలి.

పాత నిబంధనలో మరణం వరకు కుటుంబములోనే అందరూ జీవించారు. పాతనిబంధన ఆ కాలం అనేవారు అంటే దానిలో వ్రాయబడినట్లుగా నడుచుకొన అవసరము లేదని నమ్మి ఇతరులకు చెప్పే వాళ్ళు – ఆ రోజుల్లో అయితే సరిపోయింది కాని ఈ రోజుల్లో అది సాగదు అని ఇద్దరు పిల్లల తర్వాతనో లేదా ఏ సమయములోనయినా ఆపరేషన్ చేయించుకొనేవారు దేవుని నమ్మలేదన్న మాట. వారు భాషలు మాట్లాడినా, గొప్ప ప్రసంగికులైనా మిషనెరీలైనా దేవునికి వ్యతిరేకులే. కనుక పరలోకంలో వారు తమ స్థానాన్ని పొందలేరు. కృపాదానం, హన్నమ్మగారలకు 12 మంది సంతానము. ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ అంత ఖచ్చితంగా ఆచరించకపోయినా అంటే దేవుని వాక్యాన్ని గౌరవించిన ఆ రోజుల్లో ప్రతి కాన్పుకు ఇంకా ఎందుకు పిల్లలు అని అంటుండేవారు.

1962లో యూత్ క్యాంపుకు నేను మచిలీపట్నం వెళితే అక్కడ ఒక మిషనెరీగారు నాతో మాట్లాడుతూ మేము 12 మంది సంతానం, ఆరుగురు మగపిల్లలు, ఆరుగురు ఆడవారు అంటే అతని ముఖం మారిపోయింది. మీ తండ్రి అజ్ఞాని అన్నాడు. నేను ఒంగోలు వచ్చి మా తండ్రిగారికి సంగతి చెబితే ఇంగ్లాండు దేశాన్ని దేవుని వాక్యముతో విప్లవం తెచ్చిన సువార్తికుడు అతని తల్లిదండ్రులకు 15వ బిడ్డ. అతని తల్లిదండ్రులు కూడ ఈ మిషనెరీవంటివారై కుటుంబ నియంత్రణ చేసినట్లయితే? ఇంగ్లాడు దేశ విప్లవం ఏమై ఉండేది? దేవుని నిజ సువార్తను ఇంగ్లాండు వాసులు తెలుసుకొనుటకు ఇంకెంతకాలం పట్టేదో? అన్నాడు.

ఇప్పుడు కృపాదానంగారి ఆఖరి కుమారుడు అంటే 13వ సంతానము జాన్‌మార్క్ ఒంగోలుకు 22 కిలోమీటర్ల దూరంలో యానాదికాలని (దేవుని మిట్ట) గత 30 సంవత్స రాలుగా సేవ చేస్తున్నాడు.

కృపాదానం 12 మంది సంతానం ఏదో ఒక విధంగా దేవుని సేవలో ఉన్నారు. 40 మంది మనుమలు మనుమ రాండ్రు దాదాపు అందరు దేవుని సేవలో ఉన్నారు. ఇక కృపాదానం దంపతులు ప్రభువు సన్నిధి చేరే నాటికి ముని మనుమలు ఎందరో లెక్కించలేదు.

కృపాదానంగారు 1965లో అమెరికాకు ఆహ్వానించ బడిన తర్వాత వరల్డ్‌విజన్ సంస్థలో నేరుగా సంబంధాలు ఏర్పరచుకొని (అంటే మధ్యవర్తులెవరూ లేకుండా) ఒంగోలు దొనకొండ కనిగిరి, కాకులవారిపాలెం, చీరాల (ఆదిపూడి) ప్రదేశాలలో(నాలుగు) అనాధ శరణాలయములు ఏర్పాటు చేసి వేలకొలది బిడ్డలకు తల్లిదండ్రులయ్యారు. ఈ శరణాల యాలలో పెరిగిన పిల్లలందరు వారిని అమ్మా, నాయన అని పిలిచేవారట.

1969లో అమెరికా వెళ్ళినప్పుడు టీన్ మిషన్ అనే సంస్థను ఇండియా దేశమునకు తీసుకొని వచ్చిన తర్వాత బెంగుళూరు నుండి విశాఖ పట్టణం వరకు కర్నూలు నుండి కొత్తపట్నం వరకు ఆయన సేవా పరిచర్య వ్యాపించింది.

ఆయన సంతానంలో చాలామంది చాలాసార్లు విదేశాలలో సేవచేసి వచ్చారు. కొందరు విదేశాలలో నివశిస్తున్నారు. ఆ రోజున అంటే కృపాదానం హన్నమ్మగార్ల కుటుంబ జీవితంలో ఈ రోజుల్లో పిల్లలను చాకలేము అనుకొని కాని దేవునికి వ్యతిరేక పాపము అయిన కుటుంబ నియంత్రణ పాటించినట్లయితే.... ఆయన కుటుంబంలో ఇంత మంది సేవకులు ఉండేవారా? **(సశేషం)**


**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా**
**మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే**
**ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**
**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

స్త్రీల విభాగం

# రాహాబు

యేసుక్రీస్తు వంశావళిలో పలకరించబడిన రెండవ స్త్రీ రాహాబు. ఆమె జీవితం ఈ సంచిక ధ్యానభాగము.

యెహోషువ 2వ అధ్యాయంలో రాహాబును గూర్చి ప్రస్తావించబడింది. ఇశ్రాయేలీయులు కనానులో ప్రవేశించుటకు జయించవలసిన మొదటి పట్టణం యెరికో. కాబట్టి యెరికోను వేగు చూచుటకు ఇద్దరు మనుష్యులను పంపాడు యెహోషువ. వేగు చూడడానికి వచ్చిన ఇద్దరు రాహాబు అనే వేశ్య ఇంటికి వెళ్ళారు. ఆ వార్త యెరికో రాజుకు తెలిసిపోయింది కాబట్టి ఆ వేగుల వారిని తీసుకొని రమ్మని భటులను రాహాబు ఇంటికి పంపాడు. వచ్చినవారు ఇశ్రాయేలీయుల వేగులవారని తెలుసుకున్న రాహాబు వారిని మిద్దెమీద జనుపకట్టెలో దాచిపెట్టి, తనఇంటికి వచ్చిన భటులతో వచ్చినవారు వెళ్ళిపోయారని వాళ్ళెవరో తనకు తెలియదని చెప్పి పంపివేసింది.

రాహాబు యెరికో పట్టణానికి చెందిన స్త్రీ. వృత్తి రిత్యా వేశ్య. ఆమె చేసిన పని బయటకు పొక్కితే ప్రాణాలు పోయే ప్రమాదముంది. ప్రాణాలకు తెగించి ఆమె ఇశ్రాయేలీయులకు సాయపడటానికి కారణం దేవునిపై ఆమెకున్న విశ్వాసం. ఆ విషయం ఆమె వేగుల వారితో మాట్లాడిన మాటలను పరిశీలిస్తే మనకు అర్థమౌతుంది.

"*యెహోవా ఈ దేశమును మీకిచ్చు చున్నాడనియు, మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన ఈ దేశనివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును*" యెహో 2:9

రాహాబు మాటల్లో ఖచ్చితత్వం ఆమెకు దేవునిపై ఉన్న నమ్మకానికి, విశ్వాసానికి రుజువు. ఆమె ఏ మాత్రం సందేహింపక చాలా రూఢిగా మీ దేవుడు మీకు ఈ దేశాన్ని ఇస్తాడని నాకు తెలుసు అంటుంది. దేవుడు చేయబోవు వాటిని ఆమె ముందుగానే నమ్మింది.

వాస్తవానికి ఇశ్రాయేలీయులే దేవున్ని అంతగా నమ్మలేదు. అందుకే వారు దేవుడు చేసిన అద్భుతాలను ఆశ్చర్యకార్యాలను అనుభవించినప్పటికి దేవున్ని పూర్తిగా నమ్మలేదు అందుకే వారు కనాను వేగు చూచి వచ్చిన యెహోషువ కాలేబులను చంపదలచారు. ఫలితంగా దేవుని ఉగ్రతకు గురై కనాను చేరకు ముందే చనిపోయారు. అయితే దేవుని ఎరుగని ఒక అన్యురాలు అందులోను వ్యభిచార వృత్తిలో ఉన్న స్త్రీ దేవుని గూర్చి ఎంత ధృఢమైన విశ్వాసం కలిగి ఉన్నదో కదా! ఆ విశ్వాసమే ఆమె వేగులవారిని దాచిపెట్టి రాజుకు వ్యతిరేకంగా ప్రవర్తించుటకు కావలసిన ధైర్యాన్ని కలిగించింది.

"*యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహు ధైర్యము పుట్టించును*" సామె. 14:26

వినుట వలన విశ్వాసము కలుగును అను మాటకు రాహాబు సరియైన ఉదాహరణ. దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు దేశము నుండి వెలుపలికి రప్పించినపుడు చేసిన ఆశ్చర్యకార్యాలు, అద్భుతాలను గూర్చి రాహాబు విన్నది.

"*మీరు ఐగుప్తు దేశములోనుండి వచ్చినప్పుడు మీ యెదుట యెహోవా ఎఱ్ఱసముద్రపు నీరును ఏలాగు ఆరిపోచేసెనో, యొర్దాను తీరముననున్న అమోరీయుల యిద్దరు రాజులైన సీహోనుకును ఓగుకును మీరేమి చేసితిరో అనగా మీరు వారిని ఏలాగు నిర్మూలము చేసితిరో ఆ సంగతి మేము వింటిమి*". యెహో 2:10

పై వాక్యమును నిశితంగా గమనిస్తే రాహాబు దేవుని గూర్చిన ఒక సంగతి విని వదిలెయ్యలేదు. వారు ఐగుప్తు దేశము విడిచి వచ్చింది మొదలు యొర్దాను అవతల చేరువరకు అన్నివిషయాలు సేకరించింది అనవచ్చు. కనీసం సేకరించుటకు ప్రయత్నించింది అని రూఢిగా చెప్పవచ్చును.

ఐగుప్తు ఆనాటి మహాసామ్రాజ్యాలలో ఒకటి కాబట్టి అక్కడ దేవుడు చేసిన కార్యాలు, ఆలస్యంగా అయినా సరే ప్రపంచమంతా తెలుపబడి ఉంటాయి. అలానే రాహాబు వరకు చేరి ఉంటాయి. అందులోను ఆమె వేశ్య కాబట్టి రకరకాల దేశస్థుల వలన ఆమెకు సమాచారం అందటం కొంత సులువు. అయితే దేవుని గూర్చి తెలుసుకొనుటలో రాహాబు ఆసక్తి కనపరచింది. దాదాపు 40 సం॥ల

ఇశ్రాయేలీయుల జీవితాలలో భాగమైన దేవుని కార్యాలు రాహాబు ఎరిగి ఉన్నది. అంటే కొన్ని సంవత్సరాలుగా ఆమె దేవుని గూర్చి వింటూ ఉండి ఉండవచ్చు. సంవత్సరాలు తరబడి ఎరుగని దేవుని గురించి ఆసక్తి కనపరచటం ఆమెకు దేవుని పట్ల ఉన్న తృష్ణకు ఉదాహరణ. ఎందుకంటే ఆమె వృత్తి ఆమెను మిగిలిన వారితో వేరు చేస్తుంది. బంధువులైన స్నేహితులైన ఆ ప్రాంతం వారే అవుతారు కాబట్టి అందరూ అన్యులే. ఆమెకు నిజ దేవుని గురించే ప్రకటించేవారు ఎవ్వరూ లేరు.

*"మేము వినినప్పుడు మా గుండెలు కరిగిపోయెను. మీ దేవుడైన యెహోవా పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడే. మీ యెదుట ఎట్టి మనుష్యుల కైనను ధైర్యమేమాత్రము ఉండదు"* యెహో. 2:11

దేవుడు ఇశ్రాయేలీయులకు చేసిన కార్యాలను గూర్చి అనేకులు విని ఉంటారు. కాని ఎవరూ వాటి వెనుకున్న దేవుని గురించి తెలుసుకొనుటకు ఆసక్తి కనపరచలేదు. రాహాబు తనకు తెలుపబడిన దేవుని మాటలను శ్రద్ధగా వినడమే కాక ధ్యానించింది. అందుకే దేవునికి భయపడింది. ఆయన మాత్రమే దేవుడని గ్రహించింది కనుకనే ఆకాశ మందును భూమియందును యెహోవా దేవుడని చెప్ప గలిగింది. దేవునిని బట్టి ధైర్యం వహించి ఆయన పట్ల తన కున్న విశ్వాసాన్ని క్రియలలో చూపింది. నీతిమంతురాలైంది.

*"అటువలెనే రాహాబను వేశ్య కూడ దూతలను చేర్చుకొని వేరొక మార్గమున వారిని వెలుపలికి పంపి వేసినప్పుడు క్రియల మూలముగా నీతిమంతురాలని యెంచబడెను గదా"* యాకోబు 2:25

రాహాబు దేవుని యందు విశ్వాసము కలిగి ఉన్నందున అంటే తన విశ్వాసమునకు తగిన క్రియలు/ విశ్వాసమును వెల్లడి చేయు క్రియలు చేయడం ద్వారా దేవుని దృష్టిలో నీతిమంతురాలైంది. కాబట్టి దేవుడు ఆమెను రక్షించాడు.

*"విశ్వాసమును బట్టి రాహాబను వేశ్య వేగుల వారిని సమాధానముగా చేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపకపోయెను"* హెబ్రీ 11:31

ఇశ్రాయేలీయులు యెరికో మీదకు వచ్చేంత వరకు ఆమె దేవునియందు నిరీక్షణ కలిగి ఉన్నది. వేగులవారు చెప్పినట్టు తన ఇంటి కిటికీకి తొగరు దారమును కట్టి ఉంచినది. యెరికో రాజు నుండి ఆమెకు ఆపద పొంచి ఉన్నప్పటికి ఆమె జడియక, దేవుడు చేయబోవు కార్య విషయమై నిరీక్షణ కలిగి ఉన్నది. అన్యురాలై ఉండి దేవున్ని తెలుసుకోవడమే కాదు, బలంగా ఆయన యందు విశ్వాసముంచి, విశ్వాస క్రియలను కనపరచి దేవుని దృష్టిలో నీతిమంతురాలైంది. ఫలితంగా తన ప్రాణాలను తన కుటుంబాన్ని కూడా కాపాడుకుంది.

*"రాహాబను వేశ్య యెరికోను వేగు చూచుటకు యెహోషువ పంపిన దూతలను దాచిపెట్టి యుండెను గనుక అతడు ఆమెను, ఆమె తండ్రి ఇంటివారిని ఆమెకు కలిగిన వారినందరిని బ్రదుకనిచ్చెను"* యెహో. 6:25

యెరికో పట్టణం నాశనం చేయబడిన తరువాత రాహాబు ఇశ్రాయేలీయులతో కలసి జీవించింది. అంటే ఆమె తన పాపజీవితాన్ని సరిచేసుకొన్నది అని చెప్పవచ్చు. లేనియెడల యూదుడైన శల్మాను ఆమెను వివాహమాడే అవకాశమే లేదు. ఫలితంగా యూదాగోత్రంలో భాగమైంది. పరిశుద్ధ గ్రంథములో స్థానం సంపాదించింది. యేసుక్రీస్తు వంశావళిలో చేర్చబడింది. ఎంత ఆశ్చర్యమో కదా! ఒక అన్యురాలు అందులోను వేశ్య యేసుక్రీస్తు వంశావళిలో చేర్చబడటం అంటే ఎంత ధన్యత. రాహాబు వేగులవారిని చేర్చుకొని వారిని వేరొక మార్గాన పంపివేయడం వలన ఆమె నీతిమంతురాలైంది. తన ప్రాణాన్ని, తనవారిని కాపాడుకుంది, తన జీవితం సరిచేయబడింది, వేశ్య వివాహితగా మారింది. కుటుంబాన్ని పొందుకుంది. తల్లిగా మారింది. ఆమె గర్భవాసాన పుట్టినవారి నుండి లోక రక్షకుడైన యేసుక్రీస్తు జన్మించాడు. ఎంత గొప్ప విషయం. ఇన్ని ఆశీర్వాదాలు పొందుటకు కారణం ఆమె దేవునిపై ఉంచిన క్రియాసహిత విశ్వాసం.

దేవునియందు విశ్వాసం కలిగి ఉంటే, ఆ విశ్వాసం మన క్రియలలో కనబడాలి. క్రియలు లేని విశ్వాసము మృతము అని బైబిల్ సెలవిస్తుంది. కాబట్టి క్రైస్తవ స్త్రీలైన వారందరూ రాహాబువలె క్రియాత్మక విశ్వాసం గలవారై దేవుని దృష్టికి నీతిమంతులై ఆయన ఇచ్చు ఆశీర్వాదాలను పొందుకొనగలరు.

**చిన్నపిల్లల పేజి**

# కలిగిన వాటికై

రమ్య తన క్రొత్త పింక్ గౌనును ధరించి అద్దంలో చూసుకుంటూ మురిసిపోతుంది. బార్బి గౌనులా క్రిందకు వెళ్ళే కొద్ది గౌను బుట్టలా చాలా పొరలు కలిగి ఉంది నడుస్తుంటే గౌను అంచుకు ఉన్న కుచ్చులు అందంగా కదులుతున్నాయి. రంగురంగుల పూల డిజైన్ ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉంది గౌను. తల్లి వద్దన్నా వినకుండా, ఎంతో మారం చేసి తన పుట్టినరోజు కొరకు కొనుక్కున్న పింక్ గౌను మరి.

రమ్య స్కూల్‌కి వెళ్ళడానికి సిద్ధపడి టీచర్స్‌కి, పిల్లలకి ఇవ్వడానికి తల్లి సర్దిన చాక్లెట్ బాక్స్‌లను, కేక్ బాక్స్‌ను బ్యాగ్‌లో సర్దుకొని హడావిడిగా బయలుదేరుతున్న రమ్యను తల్లి ఆపి, ఈ రోజు ప్రేయర్ చేసుకున్నావా? యేసయ్యకు ధన్యవాదాలు చెప్పావా అని అడిగింది. రోజు తల్లి అడిగే ప్రశ్న కావడంతో రమ్య కాస్త విసుగుగా చేసుకున్నాను మమ్మీ, యేసయ్యకు థ్యాంక్స్ కూడా చెప్పాను అని చెప్పేసి స్కూల్‌బస్ హారన్ వినబడగానే హడావిడిగా పరిగెత్తింది.

స్కూల్‌లో అందరూ రమ్యకు పుట్టిమరోజు శుభాకాంక్షలు చెప్పారు రమ్య పిల్లల్‌దరికి చాక్లెట్స్, టీచర్స్‌కి చాక్లెట్స్‌తో పాటు కేక్ ఇచ్చింది. స్కూల్‌లో అందరూ రమ్య డ్రస్ చాలా బాగుందని మెచ్చుకున్నారు. రమ్య వాళ్ళ క్లాస్ టీచర్ అయితే తన కూతురుకి అలాంటి గౌను కొంటాను అని తన తోటి టీచర్‌తో అన్నది. ఇలా ఆ రోజంతా అందరూ రమ్య గౌనును మెచ్చుకోవడంతో రమ్య చాలా సంతోషంగా ఉంది.

ఇంటికి వచ్చిన రమ్యతో తల్లి స్కూల్‌లో ఈ రోజు ఎలా గడిచింది అని అడిగింది. అందరూ నా డ్రస్‌ను ఎంతో మెచ్చుకున్నారు తెలుసా! అంది సంతోషంగా. తల్లి తాను చేసిన గులాబ్‌జామున్ తెచ్చి రమ్య ఎదురుగా పెట్టింది. తనకు ఎంతో ఇష్టమైన స్వీట్ చూడగానే సంతోషంతో మారుమాట్లాడకుండా గబగబా తినేసింది. సరే వెళ్ళి ముందు ఆ డ్రస్ విప్పేసి వెళ్ళి స్నానం చేసి రా అన్నది తల్లి. అప్పుడేనా? ఇంకొంచెం సేపు ఈ డ్రస్‌లోనే ఉంటాను మమ్మీ ప్లీజ్ అంది రమ్య గారంగా. తల్లి సరే అన్నట్టు తలూపి వెళ్ళి వంట పనిలో నిమగ్నమైంది.

వంట పని ముగించి రమ్యను భోజనానికి రమ్మని పిలిస్తే రమ్య పలకలేదు, ఏంటా అని చూస్తే రమ్య పింక్‌గౌన్‌లో అద్దం ముందు నిలబడి అటు ఇటు తిరిగి ఏదో చూసుకుంటుంది. తల్లి గద్దింపుతో స్నానం చేసి భోజనానికి వచ్చిన రమ్య తల్లితో మమ్మీ నా బర్త్‌డే డ్రస్ చాలా బాగుంది కానీ దానికి మ్యాచింగ్ పింక్‌షూస్ ఉంటే ఇంకా బాగుండేది. నడుస్తుంటే డ్రస్ ఇంకా అందంగా కనపడేది అన్నది. తల్లి చిన్నగా నిట్టూర్చి నీ చెప్పులు పింక్‌వే కదా అన్నది. అవి కాదు మమ్మీ కాస్త హీల్ ఉండి, బెల్ట్ మోడల్ ఉంటాయే అవి. అవైతే... అని చెప్తూ ఉన్న రమ్యను అడ్డుకుని, చూడు రమ్య దేవుడు మనకు ఇచ్చిన వాటితో తృప్తి కలిగి ఉండాలి. అంత మంచి గౌను దేవుడు ఇస్తే ఇంకా ఏదో కావాలి అని కోరుకోవడం తప్పు అన్నది తల్లి. రమ్య కాస్త కోపంగా, ఈ గౌను తప్ప నా దగ్గర చెప్పుకోదగిన వస్తువు ఒకటి లేదు అన్నది. చూడు రమ్య మనకంటే దయనీయమైన స్థితిలో ఉండేవాళ్ళు కూడా ఉన్నారు కాదా, ఉన్నవాటితో తృప్తి కలిగి ఉండాలి. కావాలి అనుకుంటుంటే ఇక వాటికి అంతే ఉండదు అన్న తల్లి మాటలకు నొచ్చుకొంది రమ్య. అది గ్రహించిన తల్లి మనసులోనే దేవున్ని ఆశ్రయించి పరిస్థితిని దేవునికి అప్పగించింది.

ఒకరోజు రమ్య వాళ్ళ తరగతి ముందు ఒక తెల్లని కారు వచ్చి ఆగింది. ఆ కారు చాలా పెద్దది. ఎంత బాగుందో అనుకుంటుండగా అందులో నుండి ఒక వ్యక్తి దిగి ఒక కుర్చీ తీసుకువచ్చి తరగతి గది ముందు భాగంలో వేసాడు. ఆ కుర్చీ కూడా చాలా మెత్తగా ఉండటమే కాక ఎంతో ఆకర్షణీయంగా ఉంది. అంతలో ఆ కారు నుండి ఒక అమ్మాయి దిగి వచ్చి ఆ కుర్చీలో కూర్చుంది. అందరూ ఆ

అమ్మాయినే చూస్తున్నారు. ఆ అమ్మాయి వేసుకున్న గౌను రమ్య పింక్ గౌను కంటే చాలా బాగుంది. ఆ అమ్మాయి నడుస్తుంటే వచ్చే చెప్పుల శబ్దం మాత్రమే ఆ క్లాస్‌లో వినబడుతుంది. అంతలో టీచర్ ఆ అమ్మాయి పేరు దివ్య అని, తమక్లాస్‌లో క్రొత్తగా జాయిన్ అయిందని చెప్పింది.

రమ్య ఎలాగైనా దివ్యతో స్నేహం చేయాలని నిశ్చయించుకుంది. ఎందుకంటే కనీసం అలా అయినా కారు ఎక్కవచ్చు అని కానీ దివ్య ఎవరితో పెద్దగా మాట్లాడేది కాదు. భోజనం కారులోనే తినేది. స్పోర్ట్స్ కూడా ఆడేది కాదు. దివ్య వేసుకునే గౌనులు అన్నీ లాంగ్‌ఫ్రాక్సే అయినా కూడా దేనికదే అన్నంత బాగుండేవి.

సంక్రాంతి సెలవుల్లో తన నోట్స్‌లను దివ్యకు ఇవ్వవలసిందిగా టీచర్ చెప్పడంతో రమ్య దివ్య కారు వద్దకు వెళ్ళింది. డ్రైవర్‌కి బుక్స్ ఇచ్చి వెళ్ళమంది దివ్య కారు తలుపు తీయకుండానే. డ్రైవర్ కనపడకపోవడం, పైగా రమ్య బస్సు కదలడానికి సిద్ధంగా ఉండటంతో తప్పనిసరి పరిస్థితిలో రమ్యను కారులోకి ఆహ్వానించింది దివ్య. రమ్య ఆనందానికి హద్దులు లేవు. కానీ కారు ఎక్కిన రమ్య చెక్క కాలును తిరిగి అమర్చుకోడానికి ప్రయత్నిస్తున్న దివ్యను చూచి ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది.

బుక్స్ ఇచ్చినందుకు థ్యాంక్స్ చెప్పి హాలిడేస్ అయ్యాక నోట్స్‌లు తిరిగి ఇస్తానని చెప్పింది దివ్య. ఆమాటలతో ఈ లోకంలోకి వచ్చిన రమ్య సరే అని చెప్పి కారు దిగబోయింది. పర్లేదు కూర్చో, మీ ఇంటి వద్ద డ్రాప్ చేస్తాలే అన్నది. అవేమి తనకు వినబడనట్లు ఉంది రమ్య. ఆమె ఆలోచనలన్నీ దివ్య చెక్కకాలును గురించే. అది గమనించిన దివ్య, నాకు చిన్నతనం నుండి కాలు లేదు. అందుకే ఈ చెక్కకాలు. ఇంతకు ముందు చదివిన స్కూల్లో అందరూ ఏడిపించేవారు అందుకే ఈ స్కూల్‌కి మారాను. నా గురించి ఎవరికీ తెలియకూడదనే ఈ లాంగ్‌ఫ్రాక్స్. చెక్కకాలు కట్టుకోవడం వలన కూర్చున్నప్పుడు కాస్త అసౌకర్యంగా ఉంటుంది. అందుకే ఆ మెత్తటి కుర్చీ. నేను మీవలె అదృష్టవంతురాలను కాను, నేను పరుగెత్తలేను, ఆటలాడలేను, అందరివలె దేవుడు నాకెందుకు కాళ్ళు ఇవ్వలేదు అని రోజూ దేవున్ని అడుగుతాను అంటున్న రమ్యకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఐ యాం సారీ, నేను బస్సులో వెళ్ళిపోతాను అని చెప్పి కారు దిగి వెళ్ళిపోయింది రమ్య.

రమ్యకు దివ్య మాటలే వినిపించసాగాయి. తనకు కాళ్ళిచ్చిన దేవుని పట్ల కృతజ్ఞత భావం కలిగింది. బస్సు దిగి తల్లి వద్దకు పరుగెత్తి ఆమెను కౌగిలించుకొని దేవుడు నాకిచ్చిన వాటికై నేను అనుదినం యేసయ్యకు ధన్యవాదాలు చెప్తాను మమ్మీ అన్నది కన్నీరు నిండిన కళ్ళతో.

### పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక-18 జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 రా | ■ | 2 దా | ■ | 3 దే | ■ | 4 క్సా | ■ | 5 బె |
| 6 సి | 7 రి | యా | ■ | 8 మా | ■ | 9 అ | 10 కు | ల |
| ■ | మ | ■ | 11 క్కు | చి | డు | ■ | లా | ■ |
| 12 హ | ద | 13 దు | ■ | ప | ■ | 14 లా | బా | 15 ను |
| ప్రూ | ■ | 16 దే | మే | త్రి | 17 ఎ | వీ | ■ | తా |
| 18 ను | 19 నా | ఓ | ■ | 20 రా | ■ | 21 హ | 22 నీ | నా |
| ■ | హో | ■ | 23 త్త | మ | యి | ■ | సా | ■ |
| 24 చు | రు | 25 కు | ■ | సే | ■ | 26 క | ను | 27 నా |
| క్క | ■ | క్క | ■ | సు | ■ | ర్మీ | ■ | అ |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 18**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
3. బి. ఆనీమేరి, హైదరాబాద్
4. టి. రాజకుమారి, విజయవాడ
5. కె. అనిత, రాజమండ్రి
6. కె. తబిత, చెన్నై
7. పి. శాంతాగ్రేస్, మచిలీపట్నం
8. యం. రిబ్కా, నిజామాబాద్
9. వి. విలియం అబ్రాహామ్, బెంగుళూరు



# బైబిల్ క్విజ్-02



## ఆదికాండము

1. అబీమెలెకు స్నేహితుడు ఎవరు? ( 26 అధ్యా.)
2. రిబ్కా సహోదరుడు ఎవరు? (27 అధ్యా.)
3. యాకోబు కల కనిన ప్రదేశమునకు ఏమని పేరు పెట్టెను? (28 అధ్యా.)
4. రాహేలును పెళ్ళి చేసుకోడానికి మొత్తం ఎన్ని సం॥లు యాకోబు పని చేసెను? (29 అధ్యా.)
5. బిల్హా కుమారులు ఎవరు? ( 30 అధ్యా.)
6. లాబాను గృహదేవతలను దొంగిలించినది ఎవరు? (31 అధ్యా.)
7. దేవుని ముఖాముఖిగా చూసిన ప్రదేశమునకు యాకోబు ఏమని పేరు పెట్టెను? ( 32 అధ్యా.)
8. ఏశావు యాకోబును కలిసికొనుటకు ఎంతమందితో బయలుదేరెను? (33 అధ్యా.)
9. షెకెములోని మగవారినందరిని హతము చేసిన యాకోబు కుమారులు ఎవరు? (34 అధ్యా.)
10. ఇస్సాకు ఎన్ని సంవత్సరములు జీవించెను? (35 అధ్యా.)
11. హదరు భార్య ఎవరు? (36 అధ్యా.)
12. యోసేపును అతని అన్నలు ఎంతకు అమ్మివేసిరి? ( 37 అధ్యా.)
13. తామారు వలన యూదాకు కలిగిన కుమారులు ఎవరు? (38 అధ్యా.)
14. ఇష్మాయేలీయులు యోసేపును ఎవరికి అమ్మివేసిరి? (39 అధ్యా.)
15. యోసేపు చెప్పిన కల భావము ప్రకారము రాజు ఎవరిని ఉరి తీసెను? (40 అధ్యా.)
16. ఫరో యోసేపునకు ఏమని పేరు పెట్టెను? (41 అధ్యా.)
17. ధాన్యము కొనడానికి యోసేపు అన్నలు ఎంతమంది ఐగుప్తు దేశమునకు వెళ్ళిరి? (42 అధ్యా.)
18. యోసేపు యొక్క తమ్ముడు ఎవరు? (43 అధ్యా.)
19. బెన్యామీను గోనెలో ఏ వస్తువు పెట్టమని యోసేపు ఆజ్ఞాపించెను? (44 అధ్యా.)
20. బెన్యామీను యోసేపును కలిసికొనునప్పటికి ఎన్ని కరువు సంవత్సరములు గడచిపోయెను? ( 45 అధ్యా.)
21. యాకోబు కుటుంబం మొత్తం ఎంతమంది ఐగుప్తుకు వెళ్ళిరి? (46 అధ్యా.)
22. ఐగుప్తు దేశములో యాకోబు ఎంత కాలము బ్రదికెను? (47 అధ్యా.)
23. యోసేపు కుమారులు ఎవరు? (48 అధ్యా.)
24. లేయా ఎక్కడ సమాధి చేయబడెను? ( 49 అధ్యా.)
25. యోసేపు ఎంతకాలము జీవించెను? ( 50 అధ్యా.)

### బైబిల్ క్విజ్ - 01 జవాబులు

1.నిరాకారముగాను శూన్యముగాను (ఆది. 1:2) 2.తూర్పున ఏదెనులో (2:8) 3.సర్పము (పాము) (3:1) 4.కయీను (4:1) 5.మెతూషెల, 969 సం॥లు (5:27) 6.చితిసారకపుమ్రాను (6:14) 7.నోవహు యొక్క వయసు 600 సం॥ 2వ నెల, 17వ దినమందు (7:11) 8. ఒక సంవత్సరము, పది రోజులు (375 రోజులు) (8:14) 9.ధనస్సు (9:13) 10.పెలెగు (10:25) 11. షీనారు దేశమందు (11:2) 12.75 సం॥లు(12:4) 13.అబ్రాహాము, లోతు పశువుల కాపరుల మధ్య కలహము వలన (13:7,8) 14.మెల్కీసెదెకునకు (14:18-21) 15.400 సం॥లు (15:14) 16. 86 సం॥లు (16:16)17.13 సం॥లు (17:25) 18. 18:14 19. సోయరు (19:22) 20. వెయ్యి రూపాయలు (20:16) 21.ఫీకోలు (21:22) 22.రయూమా (22:24) 23.మక్పేలా గుహలో (23:19) 24.మిల్కా (24:24) 25.కెతూరా (25:1)